Follow: @ANNTELUGU

17-07-2025

# మహా పత్రిక

ANN తెలుగు

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 224 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## యాదాద్రికి ఎంఎంటీఎస్ రైలు

### త్వరలో పట్టాలెక్కనున్న పనులు


**రేవంత్ సర్కార్ చొరవతో ముందుకొచ్చిన కేంద్రం**

**దశాబ్దాల నుంచి ఆగుతూ.. సాగుతున్న పనులకు మోక్షం**

**హైదరాబాద్, మహా:** త్వరలో హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ రైలు పరుగులు పెట్టనుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చొరవతో మళ్ళీ కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. దీంతో పనులు త్వరలో పట్టలెక్కనున్నాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆలస్యమైంది. ఎంఎంటీఎస్ సేవల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం తరపున వాటా కింద ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టులో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



### నాకేదైనా జరిగితే ఆర్మీ చీఫ్‌దే బాధ్యత

- జైల్లో నాపై వేధింపులు పెరిగాయి
- ఇమ్రాన్ ఖాన్


02



### సీఎంల భేటీపై కేటీఆర్ హాట్ కామెంట్స్

- నిజం తేలిందంటూ ఎక్స్‌లో పోస్ట్

02



### రక్తాన్ని రంగరించి చేసింది అవినీతే

- పదేళ్ళలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తేలే
- కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్

02




**ఎన్నికలు జరిగేవి ఇవీ..**

జడ్పీలు - 31, ఎంపీపీలు - 566

జడ్పీటీసీలు - 566

గ్రామ పంచాయతీలు 12,778

వార్డుల సంఖ్య 1,12,694

# మోగనున్న స్థానిక నగారా

### 23న స్థానిక ఎన్నికల షెడ్యూల్?

## ప్రభుత్వవర్గాల్లో ప్రచారం

**స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి.. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు**

**రాష్ట్రంలో 31 జిల్లా పరిషత్ లు.. 5773 జడ్పీటీసీలకు ఎన్నికలు**

**మూడు విడతల్లో ఎన్నికలు జరిపే అవకాశం**

*తెలంగాణ మరో ఎన్నికల పోరుకు సిద్ధం కానుంది. తెలంగాణాలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఏ క్షణమైనా షెడ్యూల్ వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈనెల 23న షెడ్యూల్ రావొచ్చన్న చర్చ ప్రభుత్వవర్గాల్లో, రాజకీయవర్గాల్లో జరుగుతోంది. 42శాతం బీసీ రిజర్వేషన్లపై పట్టుదలగా ఉన్న ప్రభుత్వం అనూహ్య ఎత్తుగడలతో బీసీ రిజర్వేషన్ల అమలుదిశగా కదులుతోంది. ఈనెల 23న షెడ్యూల్ వస్తే ఆగస్టు 15లోగా జడ్పీ పీఠాలు, మండల పరిషత్ లకు ఎన్నికలు పూర్తికానున్నాయి. ఎన్నికలకు అంతా సిద్ధంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల మెటీరియల్ సిద్ధం చేయాలని కలెక్టర్లకు, జెడ్పీసీఈఓలకు, డిపిఓలకు పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్నికలకు అవసరమయ్యే సామాగ్రిని రెడీ చేసుకోవాలని పేర్కొంది. ఇప్పటికే రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు ఖరారైనట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 31 జడ్పీ, 566 జడ్పీటీసీ, 5773 ఎంపీటీసీ, 566 ఎంపీపీ స్థానాలను డిక్లేర్ చేసింది. సెప్టెంబర్ 30 లోగా తెలంగాణలో స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలనీ ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ ను తయారు చేసి ఇప్పటికే గవర్నర్ వద్దకు పంపింది. గవర్నర్ సంతకం అనంతరం రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు తెరలేవనుంది తెలుస్తోంది.* *- మహా, హైదరాబాద్*

**ఒకేరోజు అన్నీ.. జీవో, షెడ్యూల్ ఒకేసారి**

గవర్నర్ జిష్ణుదేవ్ వద్దకు ఆర్డినెన్స్ వెళ్ళగా, గవర్నర్ ఆర్డినెన్స్ కు ఆమోదం పలికితే అదేరోజు జీవో, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి ఎన్నికలకు వెళ్ళే అవకాశముందని, ఇతరులకు అడ్డుకునే అవకాశం ఇవ్వకుండా ఎన్నికల ప్రక్రియ ముగించాలన్న వ్యూహంతో సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. సర్కారు ఎత్తుగడలు ఫలిస్తే భారతదేశంలోనే తెలంగాణ మరో చరిత్ర సృష్టిస్తుంది. 31 జడ్పీలు తమ ఖాతాలో పడతాయని కాంగ్రెస్ భావిస్తోంది.

**గతంలో రిజర్వేషన్లు ఇలా..**

గత జడ్పీ ఎన్నికల్లో ఎస్టీలకు 4, ఎస్సీలకు 6, బీసీలకు 6 జడ్పీలు దక్కగా, 16 అన్ రిజర్వుడు కేటగిరీ లో ఉన్నాయి. 50 శాతం జడ్పీలు మహిళలకు కేటాయించారు. ఈ దఫా మేడ్చల్ జడ్పీని అర్బన్ లో కలిపారు. ఇపుడు 31 జిల్లాలకే ఎన్నిక జరగనుండగా, బీసీ రిజర్వేషన్లు పెరిగితే 10 లేదా 11 జడ్పీలు బీసీలకు దక్కే అవకాశాలున్నాయి.

# బనకచర్లపై చర్చే లేదు

### ఇరురాష్ట్రాలు గొడవలు పెట్టుకోవాలని కొందరు చూస్తున్నారు

**వివాదాలు లేకుండా సమస్యలు పరిష్కారం కావాలి**

తెలంగాణ హక్కులు కేసీఆర్ ధారాధత్తం చేశారు : సీఎం రేవంత్ రెడ్డి

కేంద్రజలసంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ భేటీ

ఇరు రాష్ట్రాల పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులు, ఇంజనీర్ల కమిటీలు

**ఢిల్లీ, మహా :** తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి జలాల అంశంలో ఉన్న సమస్యలపై చర్చించడానికి అధికారులు, ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ నివేదిక మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర జలశక్తిశాఖ నిర్వహించిన సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఏపీ ప్రభుత్వం నుంచి గోదావరిబనకచర్ల ప్రాజెక్టు కడతామన్న ప్రతిపాదన చర్చకు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అజెండాలో వారు కడతామనే ప్రతిపాదనే చర్చకు రానప్పుడు ఆపాలన్న చర్చే ఉండదన్నారు. ఇది అపెక్స్ కమిటీ భేటీ కాదని చెప్పారు. ‘‘తెలంగాణ హక్కులను కేసీఆర్ గతంలో ఏపీకి ధారాదత్తం చేశారు. ఆయన చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం జరిగింది.

మిగతా 2లో



### బాబు పట్టు కుదరదన్న రేవంత్

**13 అంశాలపై తెలంగాణ**

**సింగిల్ పాయింట్‌తో ఏపీ**

వివరాలు 2లో

# జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వండి

### లద్దఖ్‌ను రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్ కింద చేర్చాలి

- వర్షా కాల పార్లమెంట్ సమావేశాల్లో చట్టాన్ని తయారు చేయాలి
- ప్రధాని మోదీకి ఏఐసీసీ చీఫ్ ఖర్గే, ఎంపీ రాహుల్ గాంధీ లేఖ



**ఢిల్లీ, మహా:** ప్రధాని మంత్రి నరేంద్ర మోదీకి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే లేఖ రాశారు. జమ్మూకశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధానికి లేఖ రాశారు. రానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను మంజూరు చేస్తూ చట్టాన్ని తీసుకురావాలని కేంద్రాన్ని మేము కోరుతున్నామని గుర్తు చేశారు.

మిగతా 2లో



### టార్గెట్ బుల్లెట్ బైక్స్..

- యూట్యూబ్ చూసి దొంగతనాలు
- ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల అరెస్ట్


**బాపట్ల, మహా:** యూట్యూబ్ చూసి బుల్లెట్ బైక్‌ల తాళాలు ఎలా తీయాలో నేర్చుకొని దొంగతనాలకు పాల్పడిన ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థులను బాపట్ల జిల్లా అద్దంకి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఆరుగురు నిందితులు ఒంగోలులో, మరొకరు కందుకూరులో బీటెక్ చదువుతున్నట్లు నిర్ధారించారు. ఈ సంవత్సరం మార్చి నుంచి ఇప్పటివరకు 16 బుల్లెట్ బైక్‌లు, ఒక స్కూటీని దొంగిలించినట్లు దర్యాప్తులో తేలింది. వీటి విలువ సుమారు రూ.25.20 లక్షలుగా ఉన్నట్లు పోలీసులు అంచనా వేశారు.



## కవితకు షాకిచ్చిన కేటీఆర్

### బొగ్గుగని సంఘం బాధ్యతలు కొప్పుల ఈశ్వర్ కు.. సింగరేణి నేతలతో కీలక భేటీ.. త్వరలో కమిటీలు

**హైదరాబాద్, మహా:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కవితకు షాకిచ్చారు. కేటీఆర్, కవితకు మధ్య విభేదాలు ఉండగా, చెల్లెలు కవితకు కేటీఆర్ బిగ్ షాక్ ఇచ్చారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కు మొదటినుండీ కవిత ఇన్ ఛార్జిగా ఉండగా, ఇపుడు ఆ బాధ్యతలను మరొకరికి అప్పగిస్తూ కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు. తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం ఇంచార్జ్ గా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను నియమించడం ద్వారా కవితతో బీఆర్ఎస్ కటీఫ్ అన్నట్లు సంకేతాలిచ్చారు. టీబీజీకేఎస్ నుంచి కవితను తప్పించి, వేరొకరికి పదవి కట్టబెట్టడంపై గులాబీ శ్రేణుల్లో సంచలనంగా మారింది. తెలంగాణ భవన్ లో కేటీఆర్ తో సమావేశమైన టీబీజీకేఎస్ నేతలు బీఆర్ఎస్ కు అనుబంధంగానే పనిచేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. తెలంగాణలో టీబీజీకేఎస్ బలమైన యూనియన్ గా ఉంది. గతంలో ఒంటరిగా ఏకపక్ష విజయాలు సాధించింది. త్వరలో మిగతా కమిటీలు కూడా నియమిస్తామని, పార్టీ కోసం ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు.




### ప్రణవ గ్రూప్ భారీ మోసం!

- గతంలో హైదరాబాద్ స్టాక్ ఎక్స్ఛేంజ్ పేరు భూములతో దందా
- పంజాగుట్టలో హెచ్ఎస్ఈఎల్ షేర్ హోడర్ల ధర్నా
- తమ ప్రాపర్టీ తీసుకుని లోపలికి రానివ్వట్లేదని ఆందోళన

వివరాలు 2లో

### ఇళ్లు, రేషన్‌కార్డు ఏదైనా మహిళల పేరే

- మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలి
- ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ హామీలు నెరవేరుస్తున్నాం: మంత్రి తుమ్మల
- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తాం: మంత్రి శ్రీధర్ బాబు
- ఐదేండ్ల కాలంలో లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు మంజూరు: సీతక్క
- ఇందిరా శక్తి సంబరాల సభలో పాల్గొన్న మంత్రులు

వివరాలు 2లో

### జనగణనపై గెజిట్ విడుదల చేసిన రాష్ట్రప్రభుత్వం

వివరాలు 2లో

### ఆర్డినెన్స్‌పై గెజిట్ విడుదల చేయాలి

- రాజకీయ అవకాశాలు దక్కని కులాలకు ఫలాలు దక్కాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

వివరాలు 2లో

# బనకచర్లపై చర్చే లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం కేవలం నిర్వాహక పాత్రే పోషించింది. కేంద్రం ఎవరివైపూ మాట్లాడ లేదు. భేటీలో తీసుకున్న నిర్ణయాలన్నీ తెలంగాణ విజయమే. అనుమానించుకుంటూ పోతే ముందుకు సాగలేం. సమస్యలను పరిష్కరించుకునేందుకే ఉన్నాం.. గొడవలు పెట్టుకునేందుకు కాదు. ఇరు రాష్ట్రాలు గొడవలు పెట్టుకోవాలని కొందరు చూస్తున్నారు. వివాదాలు లేకుండా సమస్యలను పరిష్కరించుకోవడమే మా అజెండా''అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**టెలీమెట్రీల ఏర్పాటుకు ఏపీ అంగీకారం: మంత్రి ఉత్తమ్**

అంతకుముందు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని రిజర్వాయర్లు, కెనాల్స్ వద్ద యుద్ధప్రాతిపదికన టెలీమెట్రీలు ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ''కృష్ణా నదీజలాల వాడకం లెక్కలపై అనుమానాలున్నాయి. టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరాం. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా రాష్ట్రమే నిధులు కేటాయిస్తుందని చెప్పాం. వీటి ఏర్పాటుపై గత ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించింది. ఈ భేటీ సందర్భంగా టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాం''అని తెలిపారు.

## బాబు పట్టు.. కుదరదన్న రేవంత్

### 13 అంశాలపై తెలంగాణ.. సింగిల్ పాయింట్ తో ఏపీ

**హైదరాబాద్, మహా:** బనకచర్లపై ఏపీ చర్చకు ప్రయత్నించినా దానిపై చర్చించేదిలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పినట్లు తెలిసింది. చంద్రబాబు ప్రధానంగా ఈ అంశంపైనే చర్చించాలని భావించినా, దీనిపై చర్చకు ఆస్కారమేలేదని తెలంగాణ తేల్చిచెప్పింది. తెలంగాణ ముందురోజే బనకచర్లపై చర్చ అంటే తాము రామని తేల్చిచెబుతూ లేఖ కూడా రాసింది. క్రిష్ణా, గోదావరి జలాల్లో పెండింగ్ అంశాలపై చర్చకు తెలంగాణ ప్రతిపాదించింది. వ్యూహాత్మకంగా ప్రాజెక్టుల అనుమతులు కోరింది. 13 అంశాలపై తెలంగాణ చర్చకు పట్టుబట్టగా, గతంలో పెండింగ్ అంశాలపై నిపుణుల కమిటీల ద్వారా వివాదాలు పరిష్కరించుకోవాలని నిర్ణయించారు.

## ఆర్డినెన్స్‌పై గెజిట్ విడుదల చేయాలి

### రాజకీయ అవకాశాలు దక్కని కులాలకు ఫలాలు దక్కాలి
### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, మహా:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, ఇప్పటి వరకు రాజకీయ అవకాశాలు దక్కని కులాల కోసం సబ్ కోటా ఉండాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 25 వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులు అయ్యేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఆ 25 వేల పదవుల్లో సగం మహిళలకు కేటాయించే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో యూపీఎఫ్ నాయకులు, 72 కులాల ప్రతినిధులతో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సర్పంచ్‌లు, ఎంపీపీలుగా ఇప్పటి వరకు రాజకీయ అవకాశాలు దక్కని ఎన్నో కులాలు బీసీలలో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం ఎంత ముఖ్యమో, అవకాశాలు దక్కని కులాల కోసం సబ్ కోటా ఇవ్వడం కూడా అంతే ముఖ్యమని కవిత స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని, అది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశమని ఆమె వెల్లడించారు. ఇదివరకే రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు కేంద్రం వద్ద పెండింగులో ఉన్నాయని ఆమె తెలిపారు.

**రిజర్వేషన్లకు అడ్డు తగిలే అవకాశం..**

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ కేబినెట్ చేసిన సవరణ తీర్మానం గవర్నర్ వద్ద పెండింగులో ఉందని, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దానికి ఆమోద ముద్ర వేసి బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై గెజిట్ విడుదల చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసినా, ఎవరైనా కెవియట్ దాఖలు చేయకుంటే, కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లకు అడ్డు తగిలే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రిజర్వేషన్లను పెంచుతూ చట్ట సవరణ చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటే, సబ్ కేటగరైజేషన్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే అని ఆమె అన్నారు. రాజకీయ అవకాశాలు దక్కని కులాలకు ఫలాలు చేరాలంటే సబ్ కేటగరైజేషన్ ఒక్కటే మార్గమని ఆమె అభిప్రాయపడ్డారు.

## జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో చేర్చాలని కూడా విజ్ఞప్తి చేస్తున్నామని ఆ లేఖలో రాహుల్, ఖర్గే పేర్కొన్నారు.

**రాష్ట్ర హోదా ఇస్తామని గతంలో..**

తమ డిమాండ్ చట్టపరమైందని, రాజ్యాంగ.. ప్రజాస్వామ్య హక్కుల పరిధిలో ఉందన్నారు.గతంలో కేంద్ర పాలిత ప్రాంతాలకు రాష్ట్ర హోదా ఇచ్చారని, విభజనచేపట్టి పూర్తి స్థాయి రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చారని ఖర్గే ఆరోపించారు. కశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదా ఇస్తామని గతంలో పలుమార్లు చెప్పినట్లు మోదీ గురించి కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. గతంలో ఆర్టికల్ 370 గురించి కూడా పార్లమెంట్‌లో మాట్లాడుతూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను ఇవ్వనున్నట్లు ప్రధాని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.

## నాకేదైనా జరిగితే ఆర్మీ చీఫ్‌దే బాధ్యత


### జైల్లో నాపై వేధింపులు పెరిగాయి: ఇమ్రాన్ ఖాన్



**మహా:** జైల్లో తనకేదైనా జరిగితే ఆర్మీ చీఫ్ అసీం మునీర్‌దే బాధ్యత అని పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ స్పష్టం చేశారు. తన పార్టీ సభ్యులకూ ఇదే విషయాన్ని చెప్పినట్లు వెల్లడించారు. అనేక కేసులు ఎదుర్కొంటున్న ఇమ్రాన్ ఖాన్.. 2023 ఆగస్టు నుంచి జైలుకే పరిమితం కాగా, తమ నేతను విడుదల చేయాలంటూ ప్రభుత్వం, సైన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు ఇమ్రాన్‌కు చెందిన 'పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్' పార్టీ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలకు సిద్ధమయ్యాయి. ''జైల్లో నేను ఎదుర్కొంటున్న వేధింపులు ఇటీవలి కాలంలో మరింత ఎక్కువయ్యాయి. నా సతీమణి బుష్రా బీబీదీ ఇదే పరిస్థితి. ఆమె జైలు గదిలోని టీవీ కూడా నిలిపేశారు. మా ఇద్దరి ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారు. హంతకులు, ఉగ్రవాదులను మా కన్నా మెరుగైన పరిస్థితుల్లో ఉంచుతున్నారు'' అని ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. ఆర్మీ చీఫ్ అసీం మునీర్ కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతున్నట్లు తనకు తెలుసన్నారు. జైలులో తనకేదైనా జరిగితే.. ఆయన్నే జవాబుదారీ చేయాలని పార్టీ నేతలకు సూచించారు.

## పగటి పూటా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

### పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటాం
### ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ వెల్లడి



**హైదరాబాద్, మహా:** బస్సు, వ్యాన్, ఆటో డ్రైవర్లు ఉదయం పూట కూడా మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్నట్లు గుర్తించామని నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ చెప్పారు. నగరంలోని ట్రాఫిక్ పోలీసులు పగటిపూట కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ప్రారంభించారు. మింట్ కాంపౌండ్‌లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ పాల్గొన్నారు.

**అందుకే పగలు కూడా..**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవ్ అంటే వీకెండ్స్ నైట్‌లో మాత్రమే నిర్వహిస్తారనే భావనతో ప్రజలు ఉన్నారని చెప్పారు. జూన్ నెలలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఓ స్కూల్ బస్ డ్రైవర్ మద్యం సేవించి పట్టుబడ్డాడని, మొత్తం 35 మంది స్కూల్ బస్ డ్రైవర్లు ఈ తనిఖీల్లో దొరకడం షాక్‌కి గురిచేసిందన్నారు. అందుకే పగలు కూడా కొన్ని ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఈ ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామని, మైనర్‌లు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సీఎంల భేటీపై కేటీఆర్ హాట్ కామెంట్స్

### నిజం తేలిందంటూ ఎక్స్‌లో పోస్ట్

**హైదరాబాద్, మహా :** ఢిల్లీలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్.. తన ఎక్స్ ఖాతా వేదికగా బుధవారం స్పందించారు. ముసుగు వీడింది, నిజం తేటతెల్లమయ్యిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 48వ ఢిల్లీ పర్యటన గుట్టు రట్టయ్యిందని వ్యంగ్యంగా పేర్కొన్నారు. నిధులు రాహుల్ గాంధీకి, నీళ్లు చంద్రబాబుకి అన్నారు. తెలంగాణా వ్యతిరేకిని ముఖ్యమంత్రిగా గెలిపించినందుకు.. బూడిద తెలంగాణ ప్రజలకి! అని తెలిపారు.

## రక్తాన్ని రంగరించి.. చేసింది అవినీతే

- పదేళ్లలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తేలే
- కేటీఆర్ పై కాంగ్రెస్ ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా:** పదేళ్ల అధికారంలో ఉండి, కృష్ణా, గోదావరి నదులపై ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తెచ్చుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్న కేటీఆర్, ఈ రోజు సీఎం రేవంత్ రెడ్డి నిబద్ధత గురించి నోరు విప్పడం సిగ్గుచేటని కాంగ్రెస్ ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా గట్టి కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ పాలనలో కట్టినా, అది కూలిపోయింది. ఈ ప్రాజెక్టు పేరిట హరిరామ్, నూనె శ్రీధర్, మురళీధరరావు వంటి ఇంజనీర్లు వందల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఏసీబీ లెక్కలు తేల్చే పనిలో ఉంటే, కేటీఆర్‌కు సమాధానం చెప్పే దమ్ము లేదు. తన రక్తాన్ని రంగరించి కాళేశ్వరం కట్టానని చెప్పే కేసీఆర్ ఫ్యామిలీ దోపిడీ ఎంతో తెలంగాణ ప్రజల ఊహకే వదిలేస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## జనగణనపై గెజిట్ విడుదల చేసిన రాష్ట్రప్రభుత్వం

**హైదరాబాద్, మహా :** జనాభా గణనపై తెలంగాణ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. బుధవారం ఈ నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ప్రచురించారు. దేశంలో తర్వాత జనాభా గణన 2027 సంవత్సరంలో జరగనుంది. ఈ మేరకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ కార్యాలయం అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కేంద్ర హోం శాఖ విడుదల చేసిన గెజిట్ కు కొనసాగింపు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసింది. వచ్చే సంవత్సరం హౌస్ హోల్డ్ సర్వే, 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు జన గణన చేయనున్నారు. ఈ సారి జన గణనతో పాటుగా కులగణన కూడా చేయనున్నారు. జన గణనను పూర్తి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం చేయనుంది.


## ప్రణవ గ్రూప్ భారీ మోసం!

- గతంలో హైదరాబాద్ స్టాక్ ఎక్స్ఛేంజ్ పేరు భూములతో దందా
- పంజాగుట్టలో హెచ్ఎస్ఈఎల్ షేర్ హోల్డర్ల ధర్నా
- తమ ప్రాపర్టీ తీసుకుని లోపలికి రానివ్వట్లేదని ఆందోళన

హైదరాబాద్ నడిబొడ్డున రియల్ మోసం బయటపడింది. ప్రణవ గ్రూప్స్ ల్యాండ్ షేర్ హోల్డర్స్ తమ ప్రాపర్టీ తీసుకుని ప్రవణ టవర్స్ వద్దకు కూడా రానివ్వకుండా అడ్డుకోవడంతో ఆందోళనకరంగా మారింది. హైదరాబాద్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ సంస్థకు సోమాజిగూడలో ఐదు ఎకరాల స్థలం ఉన్నది. హెచ్ఎస్ఈఎల్లో 297 మంది షేర్ హోల్డర్స్ నుంచి ప్రస్తుతానికి 100 మంది షేర్ హోల్డర్ మిగిలారు. కాలక్రమంలో హెచ్ఎస్ఈఎల్ ను మూసివేయడంతో సంబంధిత స్థలంలో భారీ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే ఫిబ్రవరి 15, 2017లో హెచ్ఎస్ఈఎల్ షేర్ హోల్డర్స్ నిర్మాణ సంస్థ బూర్గు ఇన్ఫ్రా డెవలపర్స్ తో నాలుగు టవర్స్ నిర్మించేందుకు ఫిఫ్టీ ఫిఫ్టీ షేర్ ఒప్పందంతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. నిర్మాణాలను 2020 లోనే పూర్తి చేయాల్సి ఉండగా.. 2025 వరకు నిర్మాణాలు కొనసాగుతూ వచ్చాయి. మొత్తం 17,700 గజాల స్థలంలో నాలుగు టవర్స్ నిర్మించాల్సి ఉంది. ఇందులో ఏ, బీ, సీ బ్లాక్లులు రెసిడెన్షియల్, కమర్షియల్ బ్లాక్‌లను మాత్రం 19 అంతస్తుల్లో నిర్మించారు. అయితే ల్యాండ్ ఓనర్స్‌కు ఇవ్వాల్సిన ఫిఫ్టీ పర్సెంట్ షేర్‌ను వారికి ఇవ్వలేదు. దీంతో బుధవారం బాధితులు ప్రణవ టవర్స్ వద్దకు చేరుకున్నారు. వారికి పర్మిషన్ లేదంటూ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంతో షేర్ హోల్డర్ల ధర్నా దిగి బైఠాయించారు. తమ షేర్లు తమకు ఇవ్వకుండా మోసం చేసిన ప్రణవ గ్రూప్ కంపెనీలపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ఇళ్లు, రేషన్‌కార్డు ఏదైనా మహిళల పేరే

- మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలి
- ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ హామీలు నెరవేరుస్తున్నాం: మంత్రి తుమ్మల
- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తాం: మంత్రి శ్రీధర్ బాబు
- ఐదేండ్ల కాలంలో లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు మంజూరు: సీతక్క
- ఇందిరా శక్తి సంబరాల సభలో పాల్గొన్న మంత్రులు



**పెద్దపల్లి, మహా:** ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలని పేర్కొన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్కతో కలిసి పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ బీమా, ప్రమాద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలని అన్నారు.రాష్ట్రంలో మహిళలు భద్రాచలం, యాదాద్రి, వేములవాడ ఎక్కడికైనా ఉచితంగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరు మీద మహిళల ఆశీర్వాదం ఉంటే ప్రభుత్వం చల్లగా ఉంటుందని అన్నారు.

**మహిళా సంఘం సామాజిక భరోసా..**

93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. మహిళల ఆదాయం పెంచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, పాడి పశువుల పెంపకం, ఇందిరా శక్తి క్యాంటీన్, ఆర్టీసీ కు అద్దె బస్సులు, పాఠశాలలకు ఏకరూప దుస్తులు కుట్టడం వంటి అనేక మార్గాలను అన్వేషిస్తున్నామని అన్నారు.మంథని కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో మహిళా సంఘాల ద్వారా మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మహిళల ద్వారా రైతులు పండించిన పంటను మద్దతు ధరతో కొనుగోలు చేశామని అన్నారు. 60 సంవత్సరాలు నిండిన వారిని కూడా మహిళా సంఘాలలో చేర్చాలని, 15 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ సంఘంలో ఉండేలా చూడాలని అన్నారు. మహిళా సంఘం సామాజిక భరోసాగా పని చేయాలని అన్నారు. ప్రతి నెలా మహిళా సంఘాల సభ్యులు సమావేశం నిర్వహించాలని అన్నారు. దసరా, దీపావళి పండుగకు ప్రభుత్వం ఉచితంగా చీరల పంపిణీ కోసం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

**మహిళ సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..**

మహిళలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టామని, విద్యార్థులకు యూనిఫాంలు కుట్టే పనులు మహిళా సంఘాలకే అప్పగించామని మంత్ర శ్రీధర్‌బాబు తెలిపారు. మహిళ సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సోలార్ ప్యానల్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి మహిళలకే అప్పగించామన్నారు. పెద్దపల్లి జిల్లాలో మహిళా సంఘాల నుంచి 9 బస్సులను ఆర్టీసీలో అద్దెకు తీసుకున్నామని ఇదే గతంలో అయితే కొందరు పెద్దమనుషుల నుంచే ఆర్టీసీలో బస్సులు అద్దెకు తీసుకునేవారని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఆలోచనలో భాగంగా ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమనే లక్ష్యంతో పని చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. గోదావరిలో తెలంగాణ హక్కుగా రావాల్సిన ఒక్క నీటి బొట్టును కూడా వదులుకోబోమని, మన వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వంతో అన్ని ప్రయత్నాలు చేస్తామని అన్నారు. నీటి వాటాల విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టును ఎట్టి పరిస్థితిలో అంగీకరించబోయేది లేదన్నారు.

**మహిళలను పారిశ్రామికవేత్తలుగా..**

మహిళలకు ఇచ్చిన హామీలు మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే 60లక్షల యూనిఫారాలు మహిళా సంఘాలకు కుట్టేందుకు ఇచ్చి రూ.30 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. మహిళా క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, మహిళా సంఘాలకు కేటాయించిన బస్సులను ఆర్టీసీకి అద్దె ఇవ్వడం, వడ్డీ లేని రుణాలు వంటి అనేక మహిళా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుందని, మహిళల ఆర్థిక అభివృద్ధితో దేశాభివృద్ధి సాధ్యమన్నారు.

## రాష్ట్రపతికి బిల్లు పంపి ఆమోదించమని అడిగారా?


### కేసీఆర్ ఆర్డినెన్స్ తెస్తే హైకోర్టు, సుప్రీం కోర్టులు కొట్టేశాయి
### మాజీ మంత్రి వి.శ్రీనివాసగౌడ్



**హైదరాబాద్, మహా :** రాష్ట్రపతికి బిల్లు పంపి ఒక్కసారైనా ఆమోదించమని కలిసి అడిగారా? ఆర్డినెన్స్ పంపే ముందు న్యాయ కోవిదులు, బీసీ నాయకుల సలహాలు తీసుకున్నారా? అని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. న్యాయకోవిదుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపడం దురదృష్టకరమన్నారు. 2015 డిసెంబర్‌లో కేసీఆర్ హయాంలో తెచ్చిన ఆర్డినెన్స్‌కు సవరణ చేస్తూ మరో ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపారని తెలిపారు. అసెంబ్లీలో పాస్ చేసిన బిల్లును గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపారని.. బిల్లు పెండింగ్‌లో ఉండగానే గవర్నర్ దగ్గరకు అదే అంశంపై ఆర్డినెన్స్ పంపారని.. కేసీఆర్ ఆర్డినెన్స్ తెస్తే హైకోర్టు, సుప్రీంకోర్టులు కొట్టేశాయని తెలిపారు. స్వప్న రెడ్డి అనే కాంగ్రెస్ నాయకురాలు కేసీఆర్ ఆర్డినెన్స్‌పై కోర్టుకెళ్లారని, కళ్ల ముందు ఈ అనుభవం ఉండగా ఆర్డినెన్స్ ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. తమిళనాడు తరహాలో తొమ్మిదో షెడ్యూల్‌లో రిజర్వేషన్లను చేర్చడం తప్ప మరో మార్గం లేదన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన ఈఎన్సీ కనకరత్నం

### రూ. 50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆఫీసర్



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో యాంటి కరప్షన్ బ్యూరో (ఏసీబీ) దూకుడు పెంచింది. అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపుతోంది. లంచం తీసుకోవాలంటేనే అధికారులు జంకేలా చేస్తోంది. ఈ క్రమంలో ఏసీబీకి మరో అవినీతి అధికారి అడ్డంగా దొరికాడు. బుధవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేసింది. లంచం తీసుకుంటూ ఈఎన్సీ కనకరత్నం ఏసీబీ వలకు చిక్కాడు. డీఈ బదిలీ కోసం రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు. ఈ మేరకు ఈఎన్సీ కనకరత్నంపై ఏసీబీ కేసు నమోదు చేసింది. కాగా, పంచాయతీ రాజ్ శాఖలో ఈఎన్సీ హోదాలో కొన్ని రోజుల క్రితమే పదవి విరమణ చేశారు కనకరత్నం. ఏడాది పాటు కనకరత్నం పదవిని పొడగించింది ప్రభుత్వం.

# అమరావతి దేశానికి క్వాంటం వ్యాలీ

## మరో సిలికాన్ వ్యాలీలా మారుతుంది

### సీఐఐ సదస్సులో టాస్క్ ఫోర్సు నివేదిక ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
### విజన్ 2047 సాధనకు 120 సిఫార్సులు చేసిన టాస్క్ ఫోర్సు




**ఢిల్లీ, మహా:** స్వర్ణాంధ్ర 2047 సాకారం అయ్యేందుకు భవిష్యత్ ప్రణాళికగా ఏపీ ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధి నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. బుధవారం ఢిల్లీలో సీఐఐ నిర్వహించిన సమావేశంలో టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ ఈ నివేదికను ముఖ్యమంత్రికి అందించింది. మొత్తం 120 సిఫార్సులను పొందుపరచిన ఈ నివేదికను టాస్క్ ఫోర్సు బృందం రూపొందించింది. మొత్తం 17 రంగాలకు సంబంధించి అమలు చేయాల్సిన సిఫార్సులను టాస్క్ ఫోర్సు ఇందులో నివేదించింది. ఏపీ ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి నివేదిక ఆవిష్కరణ అనంతరం సీఎం పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆర్థిక పారిశ్రామిక అభివృద్ధి నివేదికను రూపొందించిన టాస్క్ ఫోర్సు సభ్యుల్ని ముఖ్యమంత్రి అభినందించారు. మరోవైపు ఏపీలో వచ్చే పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్కార్టు సర్వీసులు అందిస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టిన పెట్టుబడులను రాష్ట్ర ప్రాజెక్టుగా భావించి ప్రభుత్వం చేయూత అందిస్తుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మూడు ఆర్థిక కారిడార్లలో ఆయా రంగాలకు చెందిన పరిశ్రమల్ని ప్రోత్సహించేందుకు అనుకూలంగా విధానాలు రూపొందించామని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో వేగంగా అనుమతులు జారీ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీకి వచ్చి పెట్టుబడులు పెట్టాలని సీఎం పారిశ్రామికవేత్తలను కోరారు. విజన్ 2020 పేరిట తాను ఆవిష్కరించిన అభివృద్ధి ప్రణాళిక వాస్తవ రూపం దాల్చి ఫలితాలు చూస్తున్నామని అన్నారు. ప్రస్తుతం స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందించి రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు చేశామని వెల్లడించారు.

**అంతర్జాతీయస్థాయి అభివృద్ధి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్**

సిలికాన్ వ్యాలీ తరహాలోనే దేశంలో అమరావతిని క్వాంటం వ్యాలీగా తయారు చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ ను మార్చాలన్న లక్ష్యంతోనే ఈ తరహా ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు. అలాగే బెస్ట్ లివబుల్ సిటీగా అమరావతిని కూడా అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. జాతి నిర్మాణంలో సంపద సృష్టిలో పరిశ్రమల భాగస్వామ్యం కీలకమని అన్నారు. రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారు చేసేందుకు, నైపుణ్యమున్న మానవ వనరులని అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. సర్క్యులర్ ఎకానమీతో స్వచ్ఛాంధ్ర దిశగానూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్రతీ రంగంలోనూ అత్యుత్తమ విధానాలు అవలంబించటం వల్ల ఫలితాలను వేగంగా సాధించేందుకు ఆస్కారం ఉందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రియల్ టైమ్ లో సమాచారాన్ని సేకరించి పాలనా పరమైన నిర్ణయాలు తీసుకుంటున్నట్టు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రానికి కనీసం రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.

**చంద్రబాబుకు ఉన్న గుడ్ విల్ పెట్టుబడుల్ని ఆకర్షిస్తోంది : టాటాసన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్**

టాస్క్ పోర్సు నివేదికలో ఏపీలో 17 రంగాలకు చెందిన పరిశ్రమలు ఏఏ ప్రాంతాల్లో ఉండాలన్న అంశంపై సిఫార్సులు చేసినట్టు టాస్క్ ఫోర్సు కో చైర్మన్ చంద్రశేఖరన్ అన్నారు. ఏపీలో పుష్కలంగా ఉన్న అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ముందుకు రావాలని స్పష్టం చేశారు. ఏపీని అభివృద్ధి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ నేత అని టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ అన్నారు. అందులో భాగంగానే ఏపీ ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధి నివేదికను సిద్ధం చేశామని తెలిపారు. చంద్రబాబుకు ఉన్న గుడ్ విల్ ఏపీకి పెట్టుబడులు వచ్చేలా చేస్తుందని ఆయన అన్నారు. అమరావతిలో ఏర్పాటు అయ్యే క్వాంటం వ్యాలీ ప్రాజెక్టులో టీసీఎస్ కూడా భాగస్వామిగా ఉందని అది ఏర్పాటు అయితే దేశంలో ఒక ఎకో సిస్టం ఏర్పడుతుందని అన్నారు. ఏపీలో ప్రముఖ డేటా సెంటర్లు వచ్చేందుకు ఆస్కారం ఉందని అన్నారు.

## సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల చేయాలి

**ఎన్ఎస్పీ ఈఈ కార్యాలయం వద్ద రైతుల ధర్నా**



**మిర్యాలగూడ, మహా:** నాగార్జునసాగర్ ఎడమ కాలువకు సాగునీరు విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర నాయకులు డబ్బీకార్ మల్లేష్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎన్ఎస్పీ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, సాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 560 అడుగుల నీరు చేరిందన్నారు. శ్రీశైలం నుంచి సాగర్ ప్రాజెక్ట్ కు రోజు 50 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుందని, ప్రాజెక్టు పూర్తిగా నిండే అవకాశం ఉన్నందున.. ఎడమ కాలువకు సాగునీరు విడుదల చేసి వానాకాలం సాగు పనుల్లో ఉన్న రైతులందరికీ మేలు చేసి ఆదుకోవాలని కోరారు. నీటి విడుదల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు

## 31 జడ్ పీలు, 566 జడ్ పీటీసీలు, 5773 ఎంపీటీసీ స్థానాలు

**హైదరాబాద్,మహా:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ రాజ్ శాఖ ఏర్పాట్లకు సిద్ధమైంది. ప్రభుత్వం తాజాగా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల పట్ల కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం పంచాయతీ రాజ్ శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్ టెరిటోరియల్ కాన్స్టిట్యూఎన్సీలు, మండల పరిషత్ టెరిటోరియల్ కాన్స్టిట్యూన్సీ స్థానాల సంఖ్యను ఖరారు చేసింది. మొత్తం 566 జడ్పీటీసీ, మండల ప్రజా పరిషత్ స్థానాలు, అలాగే 5,773 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం చేసింది.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు గతంలో జనవరి 30, 2024న ముగిసిన 12,845 గ్రామ పంచాయతీలు, 5,817 ఎంపీటీసీలు, 538 జడ్పీటీసీల గడువు తర్వాత నిర్వహించబడలేదు. ఈ స్థానాలు ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ఉన్నాయి. అయితే, ఈసారి జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల సంఖ్య 539 నుంచి 566కి పెరిగింది. ఇది 31 జిల్లా పరిషత్‌లలో నిర్వహించబడుతుంది. ఎంపీటీసీ స్థానాల సంఖ్య కూడా 5,817 నుంచి 5,773కి కొద్దిగా తగ్గింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రాష్ట్ర జనాభాలో 56% ఉన్న బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడానికి తీసుకున్న చర్యగా చెప్పవచ్చు. ఈ రిజర్వేషన్ విధానం కింద గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల యూనిట్లుగా, ఎంపీపీలు, జడ్పీటీసీలు జిల్లా యూనిట్లుగా, జడ్పీ చైర్పర్సన్‌లు రాష్ట్ర యూనిట్‌గా పరిగణించబడతాయి. ప్రభుత్వం ఈ రిజర్వేషన్‌ను అమలు చేయడానికి ఒక ఆర్డినెన్స్ జారీ చేయనుంది. దీనిని రాష్ట్ర గవర్నర్‌కు పంపించారు. ఈ ఆర్డినెన్స్ చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం హైకోర్టు, సుప్రీంకోర్టులో కేవియట్‌లను దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు కీలక పోటీగా ఉంటాయి. ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీ గ్రామీణ స్థాయిలో తమ పట్టును బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఎన్నికలను ఆగస్టులో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు, సెప్టెంబరులో గ్రామ పంచాయతీలకు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## ఉద్యాన పంటలపై ఆసక్తి పెంచుకోవాలి



**ఆదిలాబాద్, మహా:** ఉద్యానవన పంటల సాగుకు జిల్లాలో అనువైన నేలలు ఉన్న నేపథ్యంలో పంటల సాగుపై ఆసక్తి పెంపొందించుకోవాలని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన యూనివర్సిటీ ప్రిన్సిపాల్, సీనియర్ శాస్త్రవేత్త మురళి సూచించారు. ఉద్యావన యూనివర్సిటీలో ఎస్సీ రైతులకు ఉద్యానవన పంటలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం తొలి రోజున తెలంగాణ హెడ్ డాక్టర్ మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట వేసిన నాటి నుండి చేతికందే వరకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. ఎటువంటి అవసరమున్నా ఉద్యానవన యూనివర్సిటీలో సంప్రదిస్తే తగు సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మురళి మాట్లాడుతూ.. గ్రామీణప్రాంతాల్లోని రైతులకు ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించేల శిక్షణాలు ఇస్తున్నామన్నారు. రైతులు కూడా ఉద్యానవన పంటలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఉద్యాన పంటలకు జిల్లాలో అనువైన నెలలుకూడా ఉన్నాయని తెలిపారు. రైతులు రెండు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండు రోజుల్లో రోజుకు 150 చొప్పున శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఉద్యానవన అధికారి సందీప్, ఏఈఓ లు శ్రీనివాస్, ఇర్ఫాన్, రైతు సంఘం నాయకులు చిలుక దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.



## తహసీల్దార్ గా సురేష్ బాధ్యతలు

**మిర్యాలగూడ, మహా:** మిర్యాలగూడ తహసీల్దార్ గా ఎస్. సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మాడ్గులపల్లి తహసీల్దార్ గా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంచార్జి తహసీల్దార్ అయిన సబ్ కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ శర్మ నుండి చార్జ్ తీసుకున్నారు. నెల రోజులుగా తహసిల్ కార్యాలయం ఇంచార్జ్ పాలనలో ఉంది.

## రాష్ట్రానికి ద్రోహం చేస్తూ రేవంత్ మరణశాసనం

- నిజాలు దాచినందుకు సీఎం క్షమాపణ చెప్పాలి
- తెలంగాణలో రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ రిమోట్ పాలన
- మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రానికి ద్రోహం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి మరణశాసనం రాశారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలో మొదటి అంశమే బనకచర్ల అని అన్నారు. కానీ.. బనకచర్ల ప్రస్తావనే రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని.. ఆయన మాటలు, చేతలకు పొంతన ఉండదని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు.

బనకచర్ల ప్రాజెక్టు, ఇతర అంశాల పరిష్కారానికే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ రిమోట్ పాలన కొనసాగుతోందని దుయ్యబట్టారు. కమిటీ నిర్ణయాన్ని అంగీకరిస్తామని సీఎం రేవంత్ చెప్పడం సబబు కాదని, బనకచర్లపై కేంద్రం భేటీయే తప్పు.. సీఎం పాల్గొనడం మరో తప్పని ఫైర్ అయ్యారు. 4 కేంద్ర సంస్థలు తిరస్కరించిన ప్రతిపాదనపై సమావేశం



ఎలా నిర్వహిస్తారు? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తూ సీఎం మరణశాసనం రాశారని, బేషరతుగా ఆయన క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## పాఠశాల క్రీడలను సక్రమంగా నిర్వహించాలి

**జిల్లా ఉద్యాశాఖధికారి శ్రీనివాస్ రెడ్డి**

**ఆదిలాబాద్, మహా:** పాఠశాల క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని క్రీడా పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఎస్.జీ.ఎఫ్ నూతన ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్నికతో పాటు క్రీడా క్యాలెండర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నామినేటెడ్ పోస్టు కావడంతో సీనియర్ పీడీ అయిన రామేశ్వర్ ను ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నామినేట్ చేశారు. ఈ సందర్భంగా పీ.ఈ.టీ లు, పీడీలు ఆయనకు అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా డీఈఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... జాతీయ, రాష్ట్ర స్థాయిలోనూ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచేలా శిక్షణలు అందించాలని, ఎస్.జీ.ఎఫ్ తరపున జిల్లా, జోనల్ స్థాయిలో పోటీలు



నిర్వహించాలన్నారు. పీడీలకు ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. పాటశాల క్రీడలు విజయవంతమయ్యేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ మాజీ కార్యదర్శి కాంతారావు, స్పోర్ట్స్ స్కూల్ హెచ్ ఏం భూమన్న, నడిమేల హరిచరణ్, స్వామి పాల్గొన్నారు.



## ఇజ్రాయెల్ నేరాల్లో అమెరికా భాగస్వామ్యం

- మళ్లీ దాడులు జరిగితే దీటుగా స్పందిస్తాం
- ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ

**మహా, జాతీయం:** అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇజ్రాయెల్ నేరాల్లో అమెరికా భాగస్వామి అని మండిపడ్డ ఆయన టెల్ అవీవ్ ఓ క్యాన్సర్ కణితి వంటిదన్నారు. వాషింగ్టన్ చెప్పుచేతల్లో నడుచుకుంటుందని ధ్వజమెత్తారు. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం జరిగి, అటు అమెరికాతో అణు చర్చలు జరపనున్న వేళ సుప్రీం లీడర్ ఈ విధంగా స్పందించారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో గొప్పగా పోరాటం చేశామన్న సుప్రీం లీడర్.. మళ్లీ ఎలాంటి దాడులు జరిగినా దీటుగా ప్రతిస్పందించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందన్నారు. ఇటీవల 12 రోజుల పాటు జరిగిన యుద్ధంలో జోక్యం చేసుకున్న అమెరికా.. ఇరాన్‌లో అణు కేంద్రాలే లక్ష్యంగా దాడులు జరిపిన సంగతి తెలిసిందే. అదే సమయంలో ఇరాన్‌కు చెందిన అనేక మంది అణు శాస్త్రవేత్తలు, వందలాది మంది పౌరులను నెతన్యాహు సైన్యం అంతమొందించింది.

## దసరా నాటికి ఎలివేటెడ్ కారిడార్

**ఉప్పల్-నారపల్లి కారిడార్ పనులు పూర్తి చేస్తాం**

చాలా కాలం కింద పనులు ప్రారంభమైనా పురోగతి లేదు

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ఉప్పల్, మహా:** దసరా నాటికి ఉప్పల్, నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కొందరు అధికారులతో కలిసి బుధవారం ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ పనులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా కాలం కిందే ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభమైనా వాటిపై పురోగతి లేదన్నారు. 'ఉప్పల్ రింగ్ రోడ్ నుండి నారపల్లి వరకు 8 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఉప్పల్ ఫ్లైఓవర్ పనులు పరిశీలించాను. ఎన్నో ఏళ్లుగా ఆర్థిక సమస్యలతో ఆగిపోయిన ఈ పనులకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనుల్లో పురోగతి తెస్తున్నాం.

**సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తాం..**

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి పలుసార్లు మంతనాలు జరిపి, పాత కాంట్రాక్టర్లను మార్చి పనులను వేగవంతం చేశాం. దాదాపు 8 ఏళ్ల కిందటే ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులను అప్పటి ప్రభుత్వం చేపట్టింది. కానీ పనుల్లో జాప్యం జరిగింది. ఇందుకు పలు కారణాలున్నాయి. ఎలివేటెడ్ కారిడార్ జాప్యంపై ఎవరినీ బాధ్యులు చేయలేం. మొదట నిర్మాణ పనులు మొదలుపెట్టిన గాయత్రీ సంస్థ ప్రాజెక్టు మధ్యలోనే తప్పుకుంది. దాంతో మరో సంస్థకు ప్రభుత్వం పనులు అప్పగించింది. త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టి సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అనుకున్న విధంగా పనులు పూర్తయితే ఈ విజయదశమి నాటికి ఎలివేటెడ్ కారిడార్ అందుబాటులోకి తీసుకొస్తామని' మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.



## పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- డిప్యూటీ సీఎంతో ఫ్రాన్స్ జనరల్ బృందం భేటీ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ బృందం భేటీ అయ్యింది. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లేమి బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో వనరులు ఇతర అంశాలను అధ్యయనం చేయాల్సిందిగా టెక్నాలజీ తదితర పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్రం అనుకూలమైన ప్రాంతమని డిప్యూటీ సీఎం ఫ్రాన్స్ బృందానికి సూచించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం ఆశ చూపి.. నిరుద్యోగులకు కుచ్చు టోపీ




**ఆదిలాబాద్, మహా:** నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్న వారికి ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపిస్తే డబ్బులు రాలుతాయన్న నమ్మకంతో ఆదిలాబాద్ పట్టణంలో ఓ ముఠా ఘరాన మోసానికి తెర లేపింది. మోసగాళ్ళ వలకు చిక్కిన దాదాపు మూడు వందల మంది బాధితులు వారికి ఇరవై వేల రూపాయల చొప్పున డబ్బులు ముట్టచెప్పారు. తీరా మోసపోయామని గ్రహించి లబోదిబోమంటున్నారు. ప్రముఖుల చేత డిజిటల్ మైక్రో ఫైనాన్స్ పేరిట ఏర్పాటు చేసి కార్యాలయాలు తెరిపించి నిరుద్యోగులకు కుచ్చుటోపీ పెట్టిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. మోసపోయామని గ్రహించిన బాధితులు సదరు కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా కార్యాలయం మూసి ఉండటంతో ఆగ్రహించిన బాధితులు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లా పోలిసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ను కలిసి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. అయితే ఈ వ్యవహారంలో బాధితుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.... ఇంద్రవెల్లి మండలం శంకర్ గూడ కు చెందిన కృష్ణ వ్యక్తి పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఇటీవల డిజిటల్ మైక్రో ఫైనాన్స్ పేరిట సంస్థలను ఏర్పాటు చేశారు. ఉట్నూర్, జైనూర్ లోనూ బ్రాంచ్ లను ప్రారంభించి ప్రముఖులతో ఫోటోలు దిగి సోషల్ మీడియా లో హల్ చల్ చేశారు. రిమ్స్ ఆసుపత్రికి సైతం కోటి కి పైగా విలువ చేసే పరికరాలు ఇస్తున్నట్లు ప్రచారం జరిపారు. ప్రజా సేవ చేస్తున్నట్లు పైకి కనిపిస్తూనే లోపల నిరుద్యోగులకు టోకరా వేసే భారీ పన్నాగం పన్నారు. ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులకు ఆశ చూపి డ్రెస్ కోడ్ సాకుతో ఇరవై వేల రూపాయలు ఇవ్వాల్సి ఉంటుందని, తిరిగి వేతనంలో ఆ నగదును జమ చేస్తామని నమ్మించారు. సదరు వ్యక్తి ప్రచారం చూసిన బాధితులు ఆయనను నమ్మి డబ్బులు ముట్టచెప్పారు. రెండు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎటువంటి స్పందన లేకపోవడంతో బుధవారం వచ్చి చూసేసరికి కార్యాలయానికి తాళం వేసి ఉంది. సంబంధిత వ్యక్తుల ఫోన్లు సైతం స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయామని గ్రహించి కార్యాలయం ఎదుట బైటాయించారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారని, ప్రచారాన్ని చూసే నమ్మి మోసపోయామని బాధితులు వాపోయారు. కృష్ణ అనే వ్యక్తి ఓ ఫౌండేషన్ పేరిట సామాజిక కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిసిందన్నారు. అదే నమ్మకంతో తాము డ్రెస్ కోడ్ కోసం రూ. 20 వేల రూపాయలు చెల్లించామని, తమకు న్యాయం చేయాలని కోరారు.

## టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఫారెస్ట్ ఏర్పాటును విరమించుకోవాలి

**ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కో కన్వీనర్ బండారు రవికుమార్**

**ఆదిలాబాద్, మహా:** కుమ్రం భీం ఆసిఫాబాద్ టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఫారెస్ట్ ఏర్పాటును విరమించుకోవాలని జీవో 49 రద్దు చేయాలని, ఇందుకోసం తీసుకొచ్చిన జీ ఓ 49ను రద్దు చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కో కన్వీనర్ బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ జీవో కారణం గా ఆసిఫాబాద్ జిల్లా లోని 339 గ్రామాలకు మనుగడ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఉట్నూర్ లోని ఓ పంక్షన్ హాల్ లో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశం లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజ్యాంగంలో ఐదవ షెడ్యూల్లో ఉన్నందున గ్రామసభలు నిర్వహించకుండా ప్రజాభిప్రాయ సేకరణ తీసుకోకుండా, పీసా చట్టం అమలు చేయకుండా జీవో తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అటవీ శాఖ ఇప్పటికే ఆదివాసీ గ్రామాలకు ఐటీడీఏ ద్వారా మంజూరైనా బోర్లు, త్రిఫెస్ కరెంట్, రహదారులను గ్రామాలలో వేయనీయకుండా అడ్డుపడుతోందని చెప్పారు. ప్రభుత్వం ద్వారా మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్లను సైతం కట్టకుండా అడ్డుపడుతున్నారని




పేర్కొన్నారు. ఇప్పటికే కవ్వాల్ టైగర్ జోన్ పేరుతో ఆదివాసీల అభివృద్ధికి ఎన్నో ఆంక్షలు పెట్టి అడ్డుపడుతున్నారని మళ్ళీ జీ వో 49 టైగర్ కంజర్వేషన్ పేరుతో ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకం చేసే ప్రయత్నాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు భూపాల్, ఉడతా రవీందర్, పైళ్ల ఆశయ్య దర్శనాల మల్లేష్, కుశాన రాజన్న, పూసం సచిన్, ఎర్మ పున్నం, తొడసం శంబు, అన్నమొల్ల కిరణ్, బొజ్జ ఆశన్న, కోట శ్రీనివాస్, అశోక్, ఆత్రం తనుష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ఆదిలాబాద్, మహా:** మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల రూపాయలు కనీస వేతనం చెల్లించడంతో పాటు ఇతరత్రా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేవారు. బుధవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు ఉద్యమ కార్యచరణ రూపొందించాలని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా పుర కార్మికులు కష్టపడుతున్నారని అన్నారు. వారి సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతన సవరణ కమిటీ రూ.19 వేలు చెల్లిస్తామని చెబుతున్నా... ఏఐటీయూసి నాయకత్వం రూ.22 వేలు చెల్లించాలన్న ప్రతిపాదన ఉంచిందన్నారు. పెండింగ్ లో ఉన్న ఈ.ఎస్.ఐ, పీ.ఎఫ్ ను సైతం వెంటనే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు చిరంజీవి, ఏఐటీయూసి నాయకులు సిర్ర దేవేందర్, గాజేంగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

EDITORIAL సంపాదకీయం

## స్థానిక ఎన్నికల్లో 50% మించి రిజర్వేషన్

# అమలు సాధ్యమేనా..?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న నిర్ణయం రాజకీయ, సామాజిక, చట్టపరమైన చర్చలకు దారితీసింది. ఈ నిర్ణయం కేంద్రరాష్ట్ర సంబంధాలు, రాజ్యాంగ సవరణలు, న్యాయ సమీక్షలు, కులగణన ద్వారా సేకరించిన గణాంకాలతో ముడిపడి ఉంది.. రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేసే తీర్పులు ఉన్నందున ఏదైనా రాష్ట్రం పరిమితికి మించి రిజర్వేషన్లు అమలు చేసే ప్రయత్నం చేసినపుడు అవి న్యాయ సమీక్షకు వెళ్ళే అవకాశం ఉంటుంది.



ఈ పరిమితిని అధిగమించేందుకు కాంగ్రెస్ సర్కార్ ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం తరుపున కేవియట్ పిటిషన్ వేసినా రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉందంటూ ఆశావహ అభ్యర్థులు ఈ నిర్ణయంపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టుకు వెళ్ళినపుడు న్యాయ సమీక్షకు గురయ్యే అవకాశం లేకపోలేదు. రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా మాత్రమే ఈ రిజర్వేషన్‌కు చట్టబద్ధమైన రక్షణ లభిస్తుందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.

2024లో నిర్వహించిన కులగణన ఈ రిజర్వేషన్ పెంపులో కీలక పాత్ర పోషించనుంది. ఈ గణన ప్రకారం, తెలంగాణ జనాభా 3.70 కోట్లుగా, బీసీలు 56.33 శాతంగా నమోదైంది, ఇందులో బీసీ ముస్లింలు 10.08 శాతం, బీసీ హిందువులు 46.25 శాతం ఉన్నారు. ఎస్సీ కేటగిరి 17.43.శాతం, ఎస్టీ కేటగిరి 10.45 శాతం , ఓపెన్ కేటగిరీ (ఓసీ) 15.79 శాతం, ఓసీ ముస్లింలు 2.48 శాతం ఉన్నారు. మొత్తం ముస్లిం జనాభా 12.56 శాతం ఉన్నారు. ఈ సర్వేలో 3.54 కోట్ల మంది పాల్గొన్నారని మరో 16 లక్షల మంది సర్వేకు దూరంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది, సర్వేలో పాల్గొనని వారిలో ఏ సామాజిక వర్గ జనాభా ఎంత ఉందో తెలుసుకునే వీలు లేకుండా పోయింది. ఈ గణాంకాలపై వివిధ కుల సంఘాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. కేసీఆర్ హయాంలో 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో ముస్లింలను బీసీల్లో కలిపి లెక్కించారా, లేదా అన్నదానిపై స్పష్టత లేదు. 2001 2011 దశాబ్ద వృద్ధి రేటును, రాష్ట్రంలో ఉన్న ఆధార్ కార్డులు, ఓటర్ కార్డుల్ని పరిగణలోకి తీసుకున్నా రాష్ట్ర జనాభా నాలుగు కోట్లకు పైగా ఉంటుందన్నది వారి వాదన.

2011 జనగణన ప్రకారం తెలంగాణ జనాభా 3.50 కోట్లు, 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 3.63 కోట్లుగా ఉంది, అంటే దాదాపు మూడున్నర ఏండ్లలో 13 లక్షల వరకు జనాభా పెరిగింది. కానీ, 2024 రాష్ట్ర జనాభా 3.70 కోట్లుగా తెలిపారు. 2014 నుంచి 2024 వరకు పదేళ్లలో కేవలం 7 లక్షల జనాభా పెరిగినట్లు ఈ సర్వే ద్వారా తెలుస్తోంది, ఇక్కడే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అంశం ఒకవేళ న్యాయ సమీక్షకు వెళ్తే న్యాయస్థానాల్లో ఈ డేటా సమర్పించినప్పుడు, దీని విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తే అవకాశం లేకపోలేదు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో " కామారెడ్డి డిక్లరేషన్" సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ అసెంబ్లీ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌ను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచే బిల్లును ఆమోదించింది. ఈ బిల్లు 50 శాతం పరిమితిని మించడం వల్ల, కేంద్ర ప్రభుత్వ ఆమోదం, రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చడం అనివార్యంగా మారింది. ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్ అమలు చేస్తే న్యాయస్థానాల్లో నిలదొక్కుకోవడం కష్టమని ప్రతిపక్ష పార్టీలతో పాటు పలు కుల సంఘాల నేతలు అధికార కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారు.. సుప్రీంకోర్టు 1992 ఇంద్రా సాహ్నీ కేసులో రిజర్వేషన్‌ను 50 శాతంగా పరిమితం చేసింది, అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఈ పరిమితిని మించవచ్చని, దీనికి శాస్త్రీయమైన గణాంకాలు అవసరమని తీర్పును ఇచ్చింది. 2010 కె. కృష్ణమూర్తి కేసులో బీసీ రిజర్వేషన్‌ల కోసం ట్రిపుల్ టెస్ట్ నియమాన్ని ప్రవేశపెట్టింది, ఇందులో ఆయా సామాజిక వర్గాల వెనుకబాటు అధ్యయనం, శాస్త్రీయమైన డేటా, 50 శాతం పరిమితి పాటించడం మొదలైనవి ఉన్నాయి. 2021 వికాస్ రావు గవాలి కేసులో కూడా ఈ నియమాన్ని మరోసారి పునరుద్ఘాటించింది.

వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్ పరిమితిని మించినప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. 2021లో మహారాష్ట్రలో మరాఠా రిజర్వేషన్ 50 శాతం పరిమితిని మించడంతో సుప్రీంకోర్టు దానిని రద్దు చేసింది, అసాధారణ పరిస్థితులను రుజువు చేయడంలో విఫలమైందని తీర్పు ఇచ్చింది. 2024లో బీహార్‌లో 65 శాతం రిజర్వేషన్‌ను పాట్నా హైకోర్టు రద్దు చేసింది, కులగణన డేటా సమర్థనీయం కాదని పేర్కొంది. తమిళనాడు 69 శాతం రిజర్వేషన్‌ను 1994లో 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా చట్టబద్ధ రక్షణ పొందింది, ఇదే విధమైన రాజ్యాంగ రక్షణ కల్పించాలని బీసీ కుల సంఘాల నేతలు అభిప్రాయ పడుతున్నారు. లేకుంటే గతంలో వెలువడిన తీర్పుల వల్ల తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం కష్టమని వాపోతున్నారు.

కేంద్రం 2026లో జనగణనతో పాటు కులగణన చేపట్టనుంది. తెలంగాణ కులగణన గణాంకాలు, కేంద్రం సేకరించే డేటాతో సరితూగకుంటే, రిజర్వేషన్ అమలు మరింత సంక్లిష్టమవుతుంది. కేంద్రం ఆమోదం లేకుండా రాష్ట్రం ఏకపక్షంగా చేసే ప్రయత్నాలు చట్టపరమైన సమస్యలను తెచ్చిపెడతాయి. రాష్ట్రం తన డేటాను కేంద్రానికి సమర్పించి, 9వ షెడ్యూల్‌లో చేర్చడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల్లో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నపుడు ఈ ప్రక్రియను ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుంది.

42 శాతం బీసీ రిజర్వేషన్ అన్నది సామాజిక న్యాయం దిశగా ముందడుగైనప్పటికీ, దీని అమలు చట్టపరమైన, రాజకీయ సవాళ్లతో కూడుకున్నది. సుప్రీంకోర్టు 50 శాతం పరిమితి, కులగణన డేటా ఖచ్చితత్వంపై సందేహాలు, కేంద్రరాష్ట్ర సంబంధాలు ఈ నిర్ణయాన్ని సంక్లిష్టం చేస్తున్నాయి. రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చడం లేదా శాస్త్రీయమైన డేటాతో ట్రిపుల్ టెస్ట్‌ను సమర్థించడం ద్వారా ఈ రిజర్వేషన్ చట్టబద్ధమైన రక్షణ పొందగలదని న్యాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.ఈ అంశం అధికార, విపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల వరకే పరిమితం అవుతుందా, లేదా సమస్య పరిష్కారం అవుతుందా అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొని ఉంది.

వ్యాసకర్త: యం.అర్జున్,
హైదరాబాద్

## శుభాంశు శుక్లా కోసం రూ.550కోట్లు ఖర్చు చేసిన ఇస్రో




అంతరిక్ష యాత్రకు వెళ్లిన శుభాంశు శుక్లా సంతోషాల నడుమ భూమికి తిరిగి చేరుకున్నారు. ఆయనకు ఈ అవకాశం దక్కడం వెనుక భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఫ్యూచర్ ప్లాన్ దాగి ఉంది. అమెరికాకు చెందిన ప్రైవేటు కంపెనీ యాక్సియం స్పేస్ నిర్వహించిన ఏఎక్స్ 4 మిషన్‌లో భాగంగా భారత వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లారు. ఏఎక్స్ 4 మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు వెళ్లే వ్యోమగాముల టీమ్‌లో శుభాంశు శుక్లాకు సీటును రిజర్వ్ చేసేందుకు ఇస్రో దాదాపు రూ.550 కోట్లు (59 మిలియన్ డాలర్లు) ఖర్చు చేసింది. 2027లో తొలి స్వదేశీ మానవ సహిత అంతరిక్ష యాత్రా ప్రాజెక్టు గగన్‌యాన్‌ను నిర్వహించాలని భారత్ యోచిస్తోంది. ఇందుకు ఇప్పటికే నలుగురు వాయుసేన అధికారులను ఎంపిక చేశారు. వారిలో ఒకరైన శుభాంశు శుక్లాకు ప్రాక్టికల్, లైవ్ అవగాహన లభించాలనే ఏకైక ఉద్దేశంతో ఇంత భారీగా నిధులను ఇస్రో వెచ్చించింది.

### శుభాంశు శుక్లాపై భారత్ ఆశలు

అంతరిక్షం నుంచి శుభాంశు శుక్లా క్షేమంగా వచ్చారు. తనపై భారత్ పెట్టుకున్న అంచనాలను శుభాంశు శుక్లా బాగా అర్థం చేసుకున్నారు. అంతరిక్షం నుంచి గొప్ప ఆశయాలతో వెలుగొందుతున్న భారత్‌ను చూశానని, అది నిర్భయంగా, విశ్వాసంతో, సగర్వంగా ఉందని శుక్లా రాసుకొచ్చారు. సారే జహా సె అచ్ఛా అనేలా భారత్ తనకు కనిపించిందన్నారు. భారత వాయుసేన వింగ్ కమాండర్ రాకేశ్ శర్మ చివరిసారిగా 1984లో అంతరిక్ష యాత్రకు వెళ్లారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి అడుగుమోపిన తొలి భారతీయుడు శుభాంశే. ఇక భారత్ కు అంతా శుభమే.

- మహా డెస్క్

### ఇస్రో వ్యూహం గగన్ యాన్

**ఏఎక్స్- 4 మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లా 20 రోజుల పాటు ఇతర వ్యోమగాములతో కలిసి ఐఎస్ఎస్‌లో గడిపారు. అక్కడి సాంకేతిక, వాతావరణ, జీవనశైలి, నిర్వహణపరమైన అంశాలపై అవగాహనకు వచ్చారు. ఆయన పొందిన ఈ అనుభవం రాబోయే రోజుల్లో భారత్ చేపట్టనున్న 'గగన్‌యాన్' మిషన్‌కు ఎంతగానో ఉపయోగపడనుంది. తాజాగా ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ కూడా ఇదే విషయాన్ని చెప్పారు. యాక్సియం స్పేస్ మిషన్ అనేది భారత్ చేపట్టనున్న గగన్ యాన్ కార్యక్రమానికి బీజాలు వేసిందన్నారు. దీని నుంచి నేర్చుకున్న పాఠాలు, భారత్ మానవసహిత అంతరిక్ష మిషన్లకు ఊతం ఇస్తుందని ఆయన విశ్వాసం వెలిబుచ్చారు.**



## నమీబియాతో స్నేహం పదిలం

భారత్, నమీబియా దేశాలు పవిత్ర స్నేహం తో మెలగుతున్నాయి. నమీబియా గురించి టూకిగా. నమీబియా దేశాన్ని గతంలో నైరుతి ఆఫ్రికా అని పిలిచేవారు. ఇది నైరుతి ఆఫ్రికా లో అట్లాంటిక్ తీరం లో ఉంది. దీని రాజధాని విండ్ హాక్, కరెన్సీ రాండ్, మాట్లాడే భాషలు ఆంగ్లం, మరియు ఆఫ్రికా జాతికి చెందిన ఒక భాష. మతం క్రైస్తవం. ఈ దేశంలో గిరిజనులు ఎక్కువ. ఈ దేశం వజ్రాలకు ఖ్యాతి గాంచింది. ప్రజల ప్రధాన వృత్తులు మత్య పరిశ్రమ, పశువుల పెంపకం.నమీబియా ప్రజలు ఎక్కువగా పశువుల పెంపకం కే ప్రాముఖ్యత ఇస్తారు. నాలుగు దేశాల పర్యటనలో భాగంగా మోదీ నమీబియా చేరుకున్నారు. అక్కడ నమీబియా అధ్యక్షురాలు డాక్టర్ నెటుంబో నంది ఎన్ ధైత్వ స్వాగతం పలికారు. మోదీ అక్కడ నుంచి నమీబియా పార్లమెంటు సభ్యులను కలిశారు. అక్కడ ప్రసంగిస్తు రెండు దేశాలు లక్ష్యం సహకారం అందించుకోవాలని ప్రసంగించారు. నామీబియా అధ్యక్షురాలు నెటు0బో నమీబియా అత్యున్నత పురస్కారం 'ఆర్డర్ అఫ్ ది మోస్ట్ ఎన్షియంట్ వెల్ విట్ షియా మిరబిలిస్' అందించారు. ఇది మోదీకి 27 వ పురస్కారం. 'వెల్ విటీషియా మిరాబిలిస్ అనేది ఎడారి మొక్క. వివిధ రంగాలలో కృషి చేసిన వారికి, నాయకత్వ లక్షణాలు ఉన్న వారికి ఈ పురస్కారం అందిస్తారు. మోదీకి ఈ పురస్కారం అందిస్తున్నప్పుడు అక్కడి పార్లమెంట్ సభ్యులు హర్ష ద్వానాలు చేశారు. మోదీ ప్రసంగిస్తు నమీబియా, భారత్ తో పలు ఒప్పందాలు చేసుకుంది. ఈ దిశలో రెండు దేశాలు కలసి కట్టుగా ఉండాలని రక్షణ, భద్రత, వ్యవసాయం, వైద్యం, విద్యా రంగం మొదలగు రంగాలలో ముందుకు సాగుతాయని చెప్పారు. భారత్ లో అంతరిస్తున్న ' చీతాలు', వాటి పునరుద్ధరణకు నమీబియా చక్కటి సహకారాన్ని అందించిందని 'చీతాలు' ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అక్కడి పార్లమెంటు సభ్యుల కరతాల ద్వనుల మధ్య ప్రకటించారు. నెటంబో మాట్లాడుతూ మోదీ సామాజిక, ఆర్థిక, అభివృద్ధికి కృషి చేశారాని పేర్కొన్నారు. రెండు దేశాలు పరస్పర సంబంధాలు పటిష్ట0 చేసుకోవాలని ఆకాంక్షించారు.

భారత రాజ్యాంగం ఉన్నతమైనదని, భారత్ లో ఓ గిరిజన మహిళా రాష్ట్రపతిగా ఉందని, అతి సామాన్యు డను అయిన నేను భారత ప్రధానిగా ఉన్నాను అంటే అది రాజ్యాంగ గొప్పతనమని, భారత రాజ్యాంగం ను గురించి గొప్పగా చెప్పారు. మోదీ, నెటు0బో తో చేతులు కలిపి మన సంస్కృతి గొప్పదని, అలాగే మన సంబంధాలు కూడా కాల పరీక్షకు తట్టుకుని నిలబడ్డాయాని చెప్పడం గమనార్హం. మోదీ అక్కడి మత్య పరిశ్రమ అభివృద్ధి గురించి తెలుసుకున్నారు. నమీబియా పౌరులు కష్ట పడే తత్వం ఉన్న వాళ్ళని, వారి అధిక ఆదాయం పశువుల పెంపకం ద్వారానే వస్తోందని, అక్కడి ప్రజలు నిబద్ధత కలవారని, నమీబియా సహకారం మాకు ముఖ్యమని, మన మధ్య ఉండాల్సింది పోటీ కాదు, సహాయ సహకారాలు అని చెప్పారు.భారత్ తో మా బంధం పదిలం అనే నెటు0బొ చెప్పడం ఇరు దేశాల మధ్య సంబంధాలు ఎప్పుడూ పరిపుష్టమే. ప్రధాని హోదాలో మోదీ నమీబియా కు వెళ్లడం ఇదే మెదటి సారి. అంతకు మునుపు ముగ్గురు భారత ప్రధానులు నమీబియా సందర్శించారు.

- కనుమ ఎల్లారెడ్డి, 93915 23027

రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబురాలు

## జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే



**వరంగల్ మహా;** మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మ గౌరవంతో జీవించాలని, వర్ధన్నపేట శాసన సభ్యులు కె ఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హన్మకొండ లోని అంబేద్కర్ భవన్ లో ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబురాలు కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పర్వతగిరి, ఐనవోలు, హసన్ పర్తి మండలాల పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ, ప్రమాదభీమా, రుణభీమా, మహి ళా సంఘాల ద్వారా నడుపుతున్న ఆర్టీసి బస్సుకు అద్దె చెల్లింపులు, నూతన రేషన్ కార్డు ల అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ విద్యుత్ కేం ద్రాలు, ఆర్టీసి బస్సులు ఇస్తున్నామని తెలిపారు. సోలార్ విద్యుత్తు రెడ్ కో సంస్థ ద్వారా తిరిగి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. మహిళా సంఘా ల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామని, ప్రభుత్వ ఉద్దేశ్యం, లక్ష్యంగా మహిళల ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. మహిళ సంఘాలకు రూ.10 లక్షల రూపాయలు ప్రమాద భీమా, రుణ భీమా రూ.22 లక్షలు, బ్యాంకు లింకేజీ రూ. 40.కోట్ల 45 లక్షలు, వడ్డీ లేని రుణాలు రూ.7 కోట్ల 76 లక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 3532 మహిళా సంఘాలలో 39,212 మంది సభ్యులున్నారని తెలిపారు. మహిళలు తలుచుకుంటే చేయలేనిది ఏమీ ఉండదని ఇంట్లో వంట నుండి పిల్లల విద్యాభ్యాసం వరకు అన్నింటిలోనూ మహిళలు ముందుంటారని తెలిపారు. గత పది సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వం మహిళలకు పైసా కూడా వడ్డీలేని రుణాలు ఇవ్వలేదని గుర్తు చేశారు. అవసరాన్ని బట్టి రుణాలు, వనరులు సమకూర్చి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసి వ్యాపార వేత్తలుగా తయారు చేయనున్నట్లు తెలిపారు. మీ శక్తి, యుక్తికి వాణిజ్య, వ్యాపార, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం గొప్ప ఆలోచనలతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. మ హిళా సంఘాల ద్వారా 3 కోట్ల రూపాయలతో సోలార్ విద్యుత్ ప్లాంట్స్ హసన్ పర్తిలో ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా ప్రభుత్వానికి విద్యుత్ విక్రయించి సంఘాల సభ్యులకు ఆదాయం సమకూర్చేల చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. హసన్ పర్తి, పర్వతగిరి, వర్ధన్నపేట లోని 3 మహిళా సమాఖ్యలకు కోటి 18 లక్షల వ్యయంతో 3 ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయించి మహిళలచే ఆర్టీసీ కు అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. డిఆర్డీవో ఆధ్వర్యంలో 16 కేంద్రాల ద్వారా 165 మందికి మహిళలకు కట్టుమిషన్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నామని, నియోజకవర్గంలో ఇప్పటివరకు 1010 నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు 3850 మందిని అదనంగా రేషన్ కార్డులలో పేర్లు నమోదు చేసి మొత్తం 4860 నూతన రేషన్ కార్డులు సభా వేదిక ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని దరఖాస్తు చేసుకున్న అర్హత గల ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేసి నాకంటూ సొంత ఇల్లు ఉండాలి అనేది కల గానే మిగలకుండా ఇందిరమ్మ ఇండ్లను విడతల వారిగా మంజూరు చేస్తూ నిరుపేదల కలలను నిజం చేసిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. మహిళలు రానున్న రాజకీయాల్లో మహిళలకే ప్రాధాన్యం ఇచ్చుటకు ముఖ్యమంత్రి కంకణబద్ధులై ఉన్నారని అన్నారు.



## సీఇఐఆర్ ను సద్వినియోగం చేసుకోండి

### పోగొట్టుకున్న మొబైల్స్ ను బాధితులకు అప్పగించిన పోలీసులు

**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని ఇంతే జార్గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్లను పోగొట్టుకున్న నలుగురు వ్యక్తుల యొక్క ఖరీదైన సెల్ ఫోన్లను ఇన్స్పెక్టర్ యంఏ షుకూర్ బుధవారం వారికి అప్పగించారు. ఈ ప్రక్రియను సీఇఐఆర్ పోర్టల్ ను ఉపయోగించి ట్రాక్ చేసి వాటిని తిరిగి సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులకు అప్పగించడం జరిగిందని ఇంతెజార్గంజ్ గంజ్ ఇన్స్పెక్టర్ యంఏ షుకూర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సైలు రవి కిరణ్, వెంకటేశ్వర్లు, రోహిత్ లు తో పాటు ఆన్లైన్ రైటర్ ఈ సెల్ ఫోన్ల లను పోర్టల్ ద్వారా శోధించిన సందీప్, క్రైమ్ కానిస్టేబుల్ దీపక్ వీరిని ఇన్స్పెక్టర్ షుకూర్ అభినందించారు.



## మంచి ఆరోగ్యానికి పోషకాహారం తీసుకోవాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హన్మకొండ మహా;** క్షయ వ్యాధిగ్రస్తులు చికిత్స సమయంలో పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మనుస్ హెల్పింగ్ హ్యాండ్ ఫర్ ఆర్ఫన్ చిల్డ్రన్ సంస్థ వారి సహకారంతో 20 న్యూట్రిషియన్ కిట్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా టీబీ పేషంట్ల కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి తో బాధపడే వారు సమయాను కూలంగా మందులను వేసుకోవాలని, అలాగే చక్కటి పోషక విలువలతో కూడినటువంటి ఆహారం తీసుకోవడం వల్ల క్షయ వ్యాధి నుండి త్వరగా కోలుకుంటారని అన్నారు. అలాగే స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవడానికి ముందుకు రావాలని వారికి చికిత్స సమయంలో పోషణ సహకారంను అందించినట్లయితే సమాజంలో క్షయ వ్యాధిని నియంత్రించడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ డిఎంహెచ్వో అప్పయ్య, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ హిమబిందు, మాస్ మీడియా అధికారి అశోక్, ప్రసన్నకుమార్, మనుస్ హెల్పింగ్ హ్యాండ్ ఫర్ ఆర్ఫన్ చిల్డ్రన్ సంస్థ మహేష్, జిల్లా టిబి కోఆర్డినేటర్లు సుష్మ, నగేష్, సూపర్వైజర్ విజయ్ హెల్త్ విజిటర్ అంజమ్మ సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆరుట్ల గ్రామంలో చురుకుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆరుట్లలో చురుగ్గా కొనసాగుతున్న ఇండ్ల నిర్మాణాలు. మంగళవారం మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా, స్లాబ్ వరకు ఇంటి నిర్మాణం పూర్తి చేసిన రావుల మహేష్, ఇల్లు నిర్మాణ పనులను ఇందిరమ్మ కమిటీ సభ్యులతో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి కలిసి పరిశీలించడం జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో అందించడం జరుగుతుందని కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ, మార లక్ష్మణ్, కంబాలపల్లి బుగ్గరాములు, కోరే బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మార సురేష్, చిందం ఐలయ్య, ఆర్ల మల్లేష్, ఆర్ల శ్రీకాంత్, చీమర్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణం త్వరగా చేపట్టాలి

### కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్



**వరంగల్ మహా;** వరంగల్ నగరం 27 డివిజన్ లోని లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ సమీపంలో గల సర్వే నంబర్ 9, ప్లాట్ నెంబర్ 63 లో గల స్థలాన్ని స్థానిక డివిజన్ చింతాకుల అనిల్ కుమార్ ఆహ్వానం మేరకు బుధవారం గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ సిటీ ప్లానర్ రవీంద్ర రడేకర్, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ అధికారులకు వివరిస్తూ ఈ స్థలం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్పొరేషన్ వారి కబ్జాలో ఉండగా కొందరు వ్యక్తులు వారి వ్యక్తిగత స్వార్థం కొరకు ఈ స్థలాన్ని కబ్జా చేయాలని చూడగా కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భాష పాక సదానందం తో కలిసి స్థలానికి సంబంధించిన సరైన పత్రాలను అధికారులకు చూపించి ఎట్టి పరిస్థితుల్లో దళిత బహుజనులకు ఉపయోగపడే విధంగా ఈ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే వారు బడుగు బలహీన వర్గాల అభివృద్ధి దృష్టిలో ఉంచుకొని 50,00000 అక్షరాల యాభై లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ స్థలాన్ని 27 డివిజన్లో ఉన్న బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కేటాయించిన ఫండ్ తో కమ్యూనిటీ హాల్ ను నిర్మాణం చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో టీ పి ఓ ఖలీలుద్దీన్, టిపిఎస్ నరేందర్, టిపి ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మీసాల ప్రకాష్, నాయకులు కొమ్ము రాజకుమా ,ర్ మంద శ్రీను, విశాల్, సుధాకర్ ,రాజేష్, మహేష్, రవి ,సాగర్, చారిభాయి ,అమర్ ,రమేష్, విజయ్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా ప్రజలకు న్యాయం అందించాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ మహా;** పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు పోలీస్ అధికారులు పారదర్శకంగా న్యాయం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ కాజీపేట పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కాజీపేట పోలీస్ స్టేషన్ ను సందర్శించి తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు స్టేషన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి పూల మొక్కను అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసులు సీపీకి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ తో పాటు కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సిసిటిఎన్ఎస్ విభాగాల పనీతీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని సిపి అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండిరగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు సంబంధించి పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, అనుమానితులు,కేడీ,డిసిలు, మిస్సింగ్, ఆస్తి నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలి. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతోపాటు, మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా,కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, కాజీపేట ఎస్.ఐలు నవీన్‌కుమార్,లవణ్‌కుమార్,శివ పాల్గొన్నారు.

## సీపీని కలిసిన సైబర్ క్రైమ్ నూతన ఏసిపి



**హన్మకొండ మహా;** రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో వరంగల్ విభాగం నూతన ఏసీపీగా భాధ్యతలు చేపట్టిన కలకోట గిరికుమార్ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పెండింగ్ సైబర్ క్రైం కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఏసీపీ కి సూచించారు..



## గంజాయి, మత్తు పదార్థాలకు యువకులు దూరంగా ఉండాలి

### మహాదేవపూర్ సిఐ రామచెందర్ రావు

**కాటారం, మహా :** యువతీ, యువకులు మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సిఐ రామచంద్రరావు అన్నారు. బుధవారం మహాదేవపూర్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సిఐ రామచంద్రరావు మహాదేవపూర్ మండలం లోని 8 మంది గంజాయి కన్స్యూమర్స్ యువకులకు కౌన్సిలింగ్ చేశారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కృషి చేయాలి, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు తీసుకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని సూచించారు. నిషేధిత గంజాయి వినియోగించిన రవాణా చేసిన, విక్రయాలు చేపట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరిత హారం కార్యక్రమం లో భాగంగా, భూపాలపల్లి ఎస్ పి కిరణ్ ఖరే ఆదేశాల మేరకు బుధవారం మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ లో సి ఐ, మహాదేవపూర్ ఎస్ ఐ ఆధ్వర్యంలో పి. ఎస్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో ఎస్. ఐ కే పవన్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శించిన సీపీ



**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్లో నిర్వహిస్తున్న పలు రికార్డులను సిపి పరిశీలించడం తోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పార్కింగ్ ఏర్పాట్లు, సిబ్బంది పనితీరు పై పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న ను అడిగి తెలుసుకున్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టిన పోలీసులు

### ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేసిన పోలీసులు

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట ల్యాబర్తి వాగు నుండి అక్రమంగా వరంగల్ కు ఇసుకను రవాణా చేస్తున్న కోటగిరి శోభన్, రసూరి రాజ్ కుమార్, కమాండ్ల లింగయ్య, ఎండి కరీం పాషా, బైరి రాజు కట్రియాల గ్రామానికి చెందిన వ్యక్తుల తో పాటు ఎండి యాకూబ్, చంద్ర గూడెం, పిల్లి రవికుమార్, జమాండ్ల పెల్లి లను బుధవారం తెల్లవారుజామున వరంగల్ దేశాయి పేట్ రోడ్ లో ఇంతే జార్గంజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా వారి నుంచి ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి వారి పై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగిందని ఇంతే జార్గంజ్ పోలీస్ ఇన్స్పెక్టర్ యంఎ షుకూర్ తెలిపారు.

## గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

**వరంగల్ మహా;** వరంగల్ నగరం లో గంజాయి కలకలం రేపుతోంది. తాజాగా తేదీ 16/7/2025 ఉదయం 11:30 గంటలకు వలుప దాసు ప్రీతమ్, తండ్రి పేరు సురేష్, వయసు 25 సంవత్సరాలు కులం పద్మశాలి వృత్తి విద్యార్థి, నివాసం ఎల్బీనగర్ కు చెందిన వ్యక్తి గంజాయి అమ్మే ఉద్దేశంతో కాశిబుగ్గ జంక్షన్ దగ్గరలో అనుమానస్పదకంగా ఉండగా అతడిని అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుండి 170 గ్రాముల ఎండు గంజాయి తో పాటు పోలీసులు అతడి స్ప్లెండర్ బైక్ స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఇంతే జార్గంజ్ పోలీస్ ఇన్స్పెక్టర్ యంఎ షుకూర్ తెలిపారు.



## కజ్జర్ల స్కూల్‌కు తాళం

### విద్యార్థుల ధర్నా

**తలమడుగు, మహా న్యూస్:** జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను జిల్లా అధికారులు చేపట్టడం జరిగింది. అందులో భాగంగా తలమడుగు మండలంలోని కజ్జర్ల ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్నటువంటి ముగ్గురు ఉపాధ్యాయులను ఈ సర్దుబాటు ప్రక్రియలో భాగంగా వేరే చోటికి పంపించడానికి ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. పిల్లల తల్లిదండ్రులు గ్రామస్తులు ఈ సర్దుబాటు ప్రక్రియను ఖండిస్తూ మంగళవారం అదరపు కలెక్టర్ కి మా ఉపాధ్యాయులు మాకు తిరిగి పంపించాలని వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవారం రోజు పాఠశాల గేటుకు తాళం వేసి విద్యార్థులు వారి తల్లిదండ్రులు అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యులు గ్రామస్తులు గేటు ముందర బైటాయించి ధర్నాను చేపట్టారు. గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామంలో ఆరుగురు ఉపాధ్యాయులు ఉండగా ముగ్గురు ఉపాధ్యాయులను ఈ సారదుబాటు ప్రక్రియలో వేరే చోటికి పంపించడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రవేటు పాఠశాలలో చదివిపిస్తున్న మా పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు మంచి విద్యను బోధిస్తున్నారని నేపథ్యంతో మా పిల్లలు మా కళ్ళ ముందు ఉంటారని నమ్మకంతో ఇక్కడ చేర్పించడం జరిగింది. కానీ పై అధికారులు విద్యార్థులు చేరింది పక్కనపెట్టి. ముగ్గురు ఉపాధ్యాయులను పంపించడం సరికాదని రేపటి వరకు మా ఉపాధ్యాయులు మాకు యథాస్థానానికి రానియెడల ఈ ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్న విద్యార్థులు అందరూ మూకుమ్మడిగా టిసీలు తీసుకొని ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తామని పిల్లల తల్లిదండ్రులు మూకుమ్మడిగా డిమాండ్ చేశారు. పాఠశాలలో క్లాస్ కు ఒక ఉపాధ్యాయుడు లేనప్పుడు అలాంటి పాఠశాలలో మా పిల్లలని ఎందుకు చదివిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇప్పుడిప్పుడే పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య ఇలా చేయడం వల్ల తగ్గే అవకాశం ఉందనీ తల్లిదండ్రులు హెచ్చరించారు. డబ్బు లేని పేదవాళ్లు కూడా అప్పోసొప్పు చేసి ప్రైవేటు పాఠశాలలో వేస్తాము తప్ప మా పిల్లలను ఇలా ఉపాధ్యాయులు తక్కువ ఉన్న పాఠశాలలో ఉంచమని మా ఉపాధ్యాయులు తిరిగి రాని యెడల మా పిల్లల భవిష్యత్తు కన్నా ఏది ఎక్కువ కాదని ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తామని తల్లిదండ్రులు చెప్పడం జరిగింది. జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించి ఆ విద్యార్థులకు న్యాయం చేస్తారో లేదో చూడాల్సిందే. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కిరణ్ కుమార్, దేవ రెడ్డి, గంగన్న, నవీన్, రాములు, స్వామి , సంతు, సురేష్, అవినాష్, రాజు, ప్రశాంత్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## భవిష్యత్ తరాల కోసమే వనమహోత్సవం

### జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



**భూపాలపల్లి, మహా :** భవిష్యత్తు తరాల సంక్షేమమే వన మహోత్సవ కార్యక్రమ లక్ష్యమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించగా, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమంలో జిల్లా పోలీసులు ముందుండాలని, అన్ని పోలీసు స్టేషన్లలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఆదేశించారు. అలాగే సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఎస్పీ గారు పేర్కొన్నారు. ప్రకృతికి అందం మొక్కలేననీ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ ఏ. నరేష్ కుమార్, వర్టికల్ డిఎస్పి నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి, మహా :**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం రాత్రి భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భూపాలపల్లి నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు కార్యకర్తల తో సమావేశం నిర్వహించారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు చిట్యాల మండల కేంద్రంలో జరిగే మహిళా శక్తి సంబురాలకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క రానున్నట్లు తెలిపారు. ఈ సంబురాల్లో అన్ని గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనేలా చూడాలని నేతలకు ఎమ్మెల్యే సూచించారు.

## సర్దుబాటు ప్రక్రియ సజావుగా చేయాలి

### విద్యాశాఖ అధికారికి టీయూటీఎఫ్ వినతి



**ఆదిలాబాద్, మహా:** ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో జరిగిన పొరపాట్లను మండల విద్యాధికారులతో గాని ప్రధానోపాధ్యాయులతో గాని కమిటీ వేసి పిల్లల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని, ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ సజావుగా చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జలంధర్ రెడ్డిలు కోరారు. బుధవారం డీఈ ఓ ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలికంగా సెలవులో ఉన్న ఉపాధ్యాయులను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఏ విధంగానైతే సర్ ప్లస్ టీచర్లను గుర్తించారో అదే విధంగా ఉపాధ్యాయుల అవసరం ఉన్న పాఠశాల ను విద్యార్థుల సంఖ్య కు అనుగుణంగా గుర్తించి ప్రక్రియ చేపట్టాలన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.



## సర్కార్ భూములను కాపాడండి...

- ఎమ్మెల్యేను కలిసిన ఆదిభట్ల గ్రామ ప్రజలు
- ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదు.. ఎమ్మెల్యే

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** అన్యాక్రాంతం అవుతున్న సర్కార్ భూములను కాపాడాలని ఆదిభట్ల గ్రామానికి చెందిన ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, ఆదిభట్ల గ్రామంలో ఉన్న రెవెన్యూ సర్వే నెంబర్ 44, 45, 51, 52, 53,101,107, 108లో గల సర్కారు భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జాలకు పాల్పడ్డారని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసిన ఆదిభట్ల గ్రామ ప్రజలు, అధికారులతో చర్చించి సర్కార్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ అక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకునే విధంగా సర్కారు అధికారులతో చర్చించి, సర్కారు భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సర్కారు భూములు ఉంటే పేదల వద్ద ఉండాలి, లేదంటే సర్కార్ వద్ద ఉండాలి, కానీ ప్రైవేటు వ్యక్తుల వద్దా ఎలా ఉంటాయని, కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని తెలిపారని గ్రామస్తులు అన్నారు.



## మంజూరైన ప్రభుత్వాసుపత్రి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి

**లక్ష్మి నర్సింహా రెడ్డి**

**ఆమనగల్లు, మహా:** ప్రజల సంక్షేమం,ఆరోగ్య భద్రత కోసం గత ప్రభుత్వ హయాంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో మంజూరైన ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం(పీహెచ్ సి) నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి స్థానిక నేతలతో కలిసి హైదరాబాద్ లో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలో సీపీఓ పీహెచ్ సి ఏర్పాటు కొరకు వినతిపత్రం అందజేసి, వెంటనే నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో కేంద్ర 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా తెలంగాణ వ్యాప్తంగా 42 ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు 66 కోట్ల రూపాయల వ్యయంతో మంజూరయ్యాయని, ఒక కోటి 43 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపట్టాలని గతంలో ఉత్తర్వులు వెలువడ్డప్పటికిని ఎన్నికల నియమావళితో ఆసుపత్రి నిర్మాణంలో కొంత జాప్యం జరిగిందన్నారు. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిని అనుసరించి ఉన్న కడ్తాల్ మండల కేంద్రంలో ప్రభుత్వాసుపత్రి లేమితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ మేరకు ప్రభుత్వం వెంటనే మంజూరి అయిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, మాజీ రైతు కోఆర్డినేటర్ జోగు వీరయ్య నాయకులు యాదయ్య గౌడ్, బాలకృష్ణ,పర్వతాలు,వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం సంపాదనతో ఎదగాలి

**మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మైనార్టీ మహిళలకు ఎమ్మెల్యే రంగారెడ్డి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, నాలుగు మున్సిపాలిటీలకు చెందిన 203 మంది మైనార్టీ మహిళలకు స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్ల కొత్వాలుతో కలిసి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని మైనార్టీ మహిళలకు, ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా కుట్టు మిషన్లు అందజేయడం జరిగిందన్నారు. స్వయం శక్తితో ఎదగాలని స్వయం సంపాదన ఉండాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళకు అనేక పథకాలను అందిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఇంటి అభివృద్ధిలో ఇల్లాలు తోడై ఆర్థికంగా బలపడినప్పుడు, ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందని తెలిపారు. సమాజంలో మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలని ఎమ్మెల్యే అన్నారు. మహిళా సంఘాల ద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలను సర్కారు అందిస్తుందని, అలాగే మహిళల ఉపాధి కొరకు కార్పొరేషన్ల ద్వారా నిధులు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ చైర్మన్ మల్ రెడ్డి రామిరెడ్డి, ఇబ్రహీంపట్నం ఏఎంసి చైర్మన్ గురునాథ్ రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ నవీన్ రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్, ముత్యాల రాజశేఖర్ రావు, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ నాయకులు, నియోజకవర్గం మైనార్టీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



త్రిబుల్ ఐటీ ర్యాంకర్ వైష్ణవిని సన్మానించిన

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

**మహా:** ఈరోజు ఫరూఖ్ నగర్ మండలం కిషన్ నగర్ గ్రామంలో మొగిలిగిద్ద పాండు ,శివలీల దంపతుల కుమార్తె వైష్ణవి త్రిబుల్ ఐటిలో మంచి ర్యాంక్ సాధించిన సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి కిషన్ నగర్ లోని వారి స్వగృహంలో వైష్ణవిని సన్మానించి అభినందించడం జరిగింది. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఆడపిల్ల చదువు అవనికి వెలుగు అని, ఆడపిల్లలు పట్టుదలతో, ఓపికతో చదివితే విజయం మీ బానిస అవుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కలలుగన్న భేటీ బచావో బేటి పడావో నినాదం వైష్ణవి లాంటి బాలికల్లో స్ఫూర్తిని నింపిందని అన్నారు. భవిష్యత్తులో వైష్ణవి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇస్నాతి శ్రీనివాస్ , మోహన్ సింగ్, చేగు సుధాకర్ అప్ప, చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, అత్తాపూర్ మహేందర్ రెడ్డి, విట్యాల నర్సింలు, కావలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

**సీసీ రోడ్డు, రైల్వే బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్దేవ్పల్లి డివిజన్ పరిధిలో జీహెచ్ఎంసీ పర్యవేక్షణలో 71 కోట్ల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు, రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాస్, డి, ఈ, కార్తీక్,రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవికుమార్ తో కలిసి స్థానిక శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిని, నాణ్యతను స్వయంగా పరిశీలించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ఈ సిసి రోడ్డు, రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మైలార్దేవపల్లి నుండి శాస్త్రిపురం, వట్టపల్లి వెళ్లే ప్రజలకు ప్రయాణ దూరం గణనీయంగా తగ్గుతుందిన్నారు. ఇది నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం. ట్రాఫిక్ సమస్యను తగ్గించి, ప్రజలకు సులువైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే ప్రభుత్వం యొక్క లక్ష్యం అన్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నమన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సందర్భంగా పునరుద్ఘాటించారు. పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈ ఈ నరేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిహెచ్ఎంసి అధికారులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమమైన సంఘం తుర్కయాంజల్ రైతు సేవా సహకార సంఘం

**అభినందనలు తెలిపిన మంత్రి తుమ్మల**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నాబార్డు 44వ వ్యవస్థాపక దినోత్సవము సందర్భంగా మంగళవారం నాబార్డు తెలంగాణ రీజినల్ కార్యాలయం హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు హాజరై, నాబార్డ్ సేవలను అభినందిస్తూ, వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందిన సంస్థల పాత్రను ప్రశంసించారు. అత్యుత్తమ పనితీరు కనబరచిన పిఎసిఎస్ సంఘాలకు అవార్డులను అందజేశారు. నాబార్డ్ సిజిఎం బి. ఉదయ భాస్కర్, TGCAB చైర్మన్ ఎం. రవీందర్ రావు, RCS సురేంద్ర మోహన్ IAS, NOFSCAB చైర్మన్ కె. రవీందర్ రావు సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... జిల్లాలోని రైతులకు నాణ్యమైన సేవలందిస్తున్న పిఎసిఎస్ సంఘాలు చాలా సంతోషమని సంఘాల చైర్మన్లను సీఈఓలను అభినందించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో రైతులకు కావలసిన సదుపాయాలను కల్పిస్తూ, తెలంగాణ ప్రభుత్వం రైతులకు సహకరిస్తుందని ఆయన తెలిపారు. తుర్కయంజాల్ రైతు సంఘం ద్వారా గోదాముల నిర్వహణ, లాకర్ల సదుపాయము, రైతులకు నాణ్యమైన ఎరువుల సరఫరా, వ్యవసాయ, వ్యవసాయేతర ఆర్థిక సేవలు, సంఘాల ఆధ్వర్యములో చేపట్టిన సామాజిక కార్యక్రమాలు, సంఘము పనితీరు కనబరిచినందుకు గాను, ఉత్తమ ప్రతిభావంతమైన సంఘముగా భావించి, తుర్కయంజాల్ పిఎసిఎస్ సంఘ అధ్యక్షులు, DCCB చైర్మన్, TGCAB వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యకు, సంఘ సీఈవో వై. రాందాస్ కు అభినందనల సర్టిఫికెట్, మెమొంటో అందజేయడం జరిగింది. డిసిసిబి చైర్మన్ మాట్లాడుతూ... ది తుర్కయాంజల్ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు అందించిన సేవలను గుర్తించిన, అత్యుత్తమైన నాబార్డ్ సంస్థ, అభినందనలు తెలిపినందుకు చాలా సంతోషమని అన్నారు. రైతుల కోసం రైతు సేవలో మరింత కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలోని జిల్లాలోని పిఎసిఎస్ సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సీఈవోలు, డిసిసిబి అధికారులు పలువురు పాల్గొన్నారు.

## నీటిపారుదల శాఖలో కీలక మార్పులు

**ఓ.వి. రమేశ్ బాబుకు ఈఎన్సీగా అదనపు బాధ్యత**

**ఖమ్మం, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల శాఖలో ఉన్నతాధికారుల మార్పులో భాగంగా ఓ.వి. రమేశ్ బాబును ఇంజినీర్ ఇన్ చీఫ్ (అడ్మినిస్ట్రేషన్) గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో చీఫ్ ఇంజినీర్గా సేవలందిస్తున్న రమేశ్ బాబుకు ఇప్పటి నుంచి ఈఎన్సీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా అధికారిక ఉత్తర్వులను ఈ రోజు విడుదల చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనుల విభాగంలో ఏర్పడిన లోపాల దర్యాప్తు అనంతరం, ప్రస్తుత ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) అనీల్ కుమార్ను ఆ పదవి నుంచి తప్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆయన ఇటీవలే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన న్యాయ విచారణలో జ్యుడీషియల్ కమిషన్ ఎదుట హాజరైన విషయం తెలిసిందే. అనీల్ కుమార్పై ఆరోపణలు తలెత్తిన నేపథ్యంలో, ఆయన్ను ఈఎన్సీ పదవి నుంచి తొలగించి, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయనకు ఈ దశలో ఎలాంటి పదవి కేటాయించలేదు. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న ఈఎన్సీ పదవికి తాత్కాలికంగా ఓ.వి. రమేశ్ బాబును నియమించడం గమనార్హం. నీటిపారుదల రంగంలో ఆయనకు ఉన్న అనుభవం, కార్యనిర్వహణ ప్రతిభ నేపథ్యంలో ప్రభుత్వం ఈ బాధ్యత అప్పగించినట్లు భావించబడుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై జరుగుతున్న విచారణల నేపథ్యంలో ఈ మార్పులు ప్రభుత్వం తీసుకున్న తొలి అడుగుగా చెప్పవచ్చు. మేడిగడ్డ గ్రౌటింగ్ పనుల నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో, బాధ్యతల విచారణ, సరైన వ్యక్తులను నియమించడం ద్వారా మళ్లీ ప్రజా నమ్మకాన్ని సంపాదించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఇదే సమయంలో ఓ.వి. రమేశ్ బాబు నియామకం ద్వారా తెలంగాణ సర్కార్ నీటిపారుదల శాఖలో పరిపాలనపరమైన పటుత్వాన్ని, పారదర్శకతను మెరుగుపరచే దిశగా ముందుకు సాగుతున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## కాంగ్రెస్ విఫలంతోనే బీఆర్ఎస్‌లో చేరికలు

**దశరథ్ నాయక్**

**ఆమనగల్లు, మహా:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వైఫల్యానికి గురైందని, ప్రజా పాలన పేరుతో అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ తో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, బీఆర్ఎస్ నేత జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్కు పరిపాలనపై సరైన అవగాహన లేక రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. కెసిఆర్ పాలనతో పోలిస్తే రేవంత్ పాలన నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కెసిఆర్ జైపాల్ యాదవ్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి గుణపాఠం చెబుతారాన్నారు. ఈ సందర్భంగా మక్తమాదారం గ్రామానికి చెందిన మర్ల రాజేందర్ యాదవ్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేసీఆర్ పై నమ్మకంతో గులాబీ గూటికి చేరిన రాజేందర్ యాదవ్కు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీ నేతలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన సాయిలు భాగ్యమ్మ జంగయ్య గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ నాయకులు జలీల్ చందు సోమ్లా కిషన్ జగన్ రాజేష్ శ్రీకాంత్ లచ్చిరాం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీల పంపిణి

**34 మంది లబ్ది దారులకు అందచేసిన ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి**



**షాద్ నగర్, మహా:** సీఎంఆర్ఎఫ్ చెక్కులను షాద్ నగర్ లోని ఎమ్మెల్సి కార్యాలయం లో లబ్ధిదారులకు అందచేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఫరూక్ నగర్ మండలానికి చెందిన చిత్తాపూర్ సుగుణ,చెన్నయ్య,ఉమంత్యాల సునీత,గడ్డం హరీష్, అలవాల పవన్ కుమార్,వన్నాడ నవ్య రాణి,తీగలపల్లి పవన్ కుమార్, గుడవారతి శ్యాంసుందర్,అనిమి పద్మమ్మ,కేశంపేట మండలానికి చెందిన కాసారపు రంగయ్య, శ్రీనయ్య ,భూపాల్ రెడ్డి ,అంజమ్మ, చాపల జంగయ్య,రేణుక,కొత్తూరు మండలానికి చెందిన సభావాత్ కిషన్,ప్రవీణ్ కుమార్,రజిత తల్లోజు,నరసింహారెడ్డి,సురేందర్ రెడ్డి,మైలారం సింధు,నందిగామ మండలానికి చెందిన కట్న జ్ఞానేశ్వర్, మామిలపల్లి పెంటయ్య, చౌదర్ గూడ మండలానికి చెందిన పిట్ట అనిత,లింగమ్మ,జనార్దన్ రెడ్డి, కడ్తాల మండలానికి చెందిన బట్టు యశోద,కుల్కచర్ల మండలానికి చెందిన మల్లమ్మ, చిన్న చింతకుంట మండల్ చెందిన పుష్పలత,దామరగిద్ద మండలానికి చెందిన బోయిని రాములు, మరికల్ మండలానికి చెందిన రామచంద్రయ్య లకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మరియు పెంట్లవెల్లి మండలానికి చెందిన కర్ణకోట శ్రీనివాసులు,చిన్నంబావి గ్రామానికి చెందిన కుంభకారి నరేష్ లకు LOC లను మొత్తం 34 మంది లబ్ది దారులకు అందజేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు జడ్పిటిసి రామకృష్ణ, బాబురావు,శేఖర్ పంతులు ,కాట్న రవీందర్,ప్రమోద్ పంతులు,యారం శేఖర్ రెడ్డి,నాగిళ్ళ వెంకటేష్,యాదగిరి రావు, బాలరాజు గౌడ్, శ్రీశైలం యాదవ్,గోపాల్ గౌడ్,పిట్టా ప్రేమ్ కుమార్,అశోక్ రెడ్డి,శివరాజ్ గౌడ్, మధుసూదన్ రావు ,అజయ్ నాయక్,సోలిపూర్ ఆంజనేయులు, రమేష్ యాదవ్,మున్నూరు నరేందర్,అనమోని నరసింహులు,ఆనంద్ యాదవ్, రెడ్యా నాయక్, నరేందర్ రెడ్డి, మహేష్,రాజు ,నర్సింలు, ధర్మ, జంగిలి కుమార్,ఘనపూర్ నర్సింలు,జంగయ్య,దినేష్,సాగర్,గుట్ట రాజు, అన్మరి రాజు,సుధీర్,మధు తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు

**బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**



**రాజేంద్రనగర్ మహా ;** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధం గూడ, విశ్వేశ్వర కాలనీ, బృందావన్ కాలనీ, కేకే 2 నగర్, దత్తాత్రేయ కాలనీ, రంగారెడ్డి కాలనీ, విగ్నేశ్వర కాలనీ లో బిజెపి నాయకులు తోకలిసి నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి పలు కాలనీలో పర్యటించారు. కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలలో నివాసముంటున్న వారిని మూసి ప్రక్షాళన పేరుతో హైడ్రా అధికారులు స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పేద మధ్యతరగతి వారు జీవితాంతం కూడబెట్టిన రిటర్మెంట్ డబ్బులత ప్రభుత్వం గుర్తించిన వెంచర్లల్లో ప్లాట్లు కొనుగోలు చేసి గృహాలు నిర్మించుకున్న రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాధికారులు మూసీ ప్రక్షాళన పేరుతో కాలనీవాసులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో నిరుపేదలకు అన్యాయం జరిగితే బిజెపి పార్టీ చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. హైడ్రా అధికారులకు దమ్ముంటే అసదుద్దీన్ ఓవైసీ నిర్మించిన నిర్మాణాన్ని ముందు కూల్చి రండి అన్నారు. తెలంగాణ ప్రాంతంలో ప్రజలు జీవించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందిగా మారిందిన్నారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూసి ప్రక్షాళన పేరుతో హైడ్రాధికారులు ప్రభుత్వం గుర్తించిన వెంచర్లల్లో మధ్య తరగతి పేదలు నిర్మించుకున్న ఇళ్లకు మార్కు వేసి పోయారు. బిజెపి పార్టీ వాటిని అడ్డుకుంది. ప్రభుత్వ భూమిని పార్కు కోసం కేటాయిస్తే కొందరు నాయకులు అధికారులకు పరమయించి జనావాసాల ఇళ్ల మధ్యలో సీవరేజ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామనడం హాస్యాస్పదమన్నారు. ఇలాంటి ప్లాంట్ ను అడ్డుకుంటామన్నారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలనీ వాసులకు బిజెపి పార్టీ అండగా ఉంటుందన్నారు.



నివాస గృహాల మధ్య మురుగునీరు

## శుద్ధి చేసే ప్లాంటును నిర్మించవద్దు

**హెచ్ఎండబ్ల్యుఎస్ అధికారులకు పలు కాలనీ వాసుల విజ్ఞప్తులు**

**రాజేంద్రనగర్ మహా ;** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడాలోనీ విజ్ఞేశ్వర కాలనీ, బృందావన్ కాలనీ, కేకే 2 నగర్, దత్తాత్రేయ కాలనీ, రంగారెడ్డి కాలనీల మధ్య ఎస్ టి పి (సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) ను ఏర్పాటు చేయరాదని. పలు కాలనీవాసులు బుధవారం హైదరాబాద్ జలమండలి కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. దాదాపు పది కాలనీల మధ్యలో ఇలాంటి మురుగునీటి శుద్ధి ప్లాంట్ ను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యంతో పాటు అనారోగ్యాలకు గురవుతారు, అలాగే వాతావరణ కాలుష్యం, శబ్ద కాలుష్యం కలిగి ఆరోగ్య సమస్యలు తలితే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి ఎస్ టి పి లను కాలనీల మధ్యలో నెలకొల్పడం వల్ల కాలుష్యంతో పాటు స్థానికులు అనేక రోగాల బారిన పడే అవకాశం ఉందని కాలనీవాసులకు అధికారులకు తెలియజేశారు. స్పందించిన అధికారులు రెవెన్యూ శాఖ వారితో చర్చించి వేరొక ప్రాంతంలో ఎస్ టి పి నిర్మించడానికి సహకరిస్తామని తెలిపారు.

కబ్జాకు గురవుతున్న పార్కు స్థలాలు.. ప్రభుత్వ భూములు పరిరక్షించాలని

## రిలే నిరాహార దీక్ష చేపట్టిన బీజేపీ నాయకులు




**బాలాపూర్ మహా:** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులు, ప్రభుత్వ భూములు,పార్కు స్థలాలు,ఓపెన్ స్థలాల ఆక్రమణలు, వివిధ శాఖల లో అధికారుల నిర్లక్ష్యం,అవినీతి ,నిధుల దుర్వినియోగం ఇతర అంశాల పరిష్కార సాధన కోసం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి,రామిడి వీరకర్ణ రెడ్డి ఆధ్వర్యం మున్సిపల్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ నాయకులు కలిసి కార్పొరేషన్ అవినీతిలో నిలబెట్టారని మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు ఆరోపించారు. కార్పొరేషన్ లో వేల గజాల పార్కు స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని దీని పై భారతీయ జనతా పార్టీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోకుండా కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతం లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీలో చేరిన సబితా ఇంద్రా రెడ్డి,ఇప్పుడు అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ నుండి అధికార కాంగ్రెస్ పార్టీ లోకి వెళ్లాలని వీర కర్ణ రెడ్డి సూచించారు. ప్రభుత్వము భూములు పార్కు స్థలాలు కాపాడవలసిన బాధ్యత ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి కి లేదా అంటూ బీజెపి నాయకులు ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాయకుండా కబ్జాల పై చర్యలు తీసుకోవాలని రామ కృష్ణా రెడ్డి డిమాండ్ చేశారు. అక్రమార్కుల పై కమిషనర్ చర్యలు తీసుకోకపోతే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. 2022 లో ప్రారంభించిన పనులు ఇప్పటి వరకు పూర్తి కాలేదని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సబితా ఇంద్రారెడ్డి అధికారం లో ఉంటేనే అభివృద్ధి గుర్తొస్తుందా,అధికారం లో లేకుంటే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు అంటూ బీజెపి నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి పార్కు స్థలాలను మాయం చేస్తున్నారని బీజెపి నాయకులు ఆరోపించారు. అనంతరం బీజెపి రాష్ట్ర నాయకులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపు చేశారు. ఈ కార్యక్రమం లో జాతీయ కిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్,బిజెపి రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తర్రే మల్లేష్ యాదవ్,మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా నాయకులు నడి కుడ యాదగిరి,ఏనుగు ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, మాజీ కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్ గడ్డం లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఏనుగు రామిరెడ్డి, సహకార బ్యాంకు డైరెక్టర్ పేతుల పుల్లారెడ్డి బిజెపి సీనియర్ నాయకులు నవారు శ్రీనివాస్ రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రేసు నరసింహారెడ్డి, పాలు బాయ్ లక్ష్మణ్, నిమ్మల రవికాంత్ గౌడ్, శశివర్ధన్ రెడ్డి, సైదులు, రాంబాబు గౌడ్, రాష్ట్ర ఓబిసి మూర్చ నాయకులు లాలా సందీప్, రవి గౌడ్, కుంటి భాస్కర్, మంత్రి మహేష్, సాయి సంతోష్, కొండల్ యాదవ్, బిజెపి, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.


## విద్యార్థుల చదువులకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి

**పెండింగ్‌లో ఉన్న ఫీజురీయంబర్స్ మెంట్స్ 8158 కోట్లు వెంటనే విడుదల చేయాలి**

**ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు: కేవై ప్రణయ్, విద్యార్థులతో భారీ ర్యాలీ**



**రాజేంద్రనగర్, మహా ;** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటి ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న 8158 కోట్లు స్కాలర్ షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై విద్యార్థులతో కలిసి బుధవారం రాస్తారోకో ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కేవై ప్రణయ్, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్స్,స్కాలర్ షిప్స్ రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడాయి. విద్యార్థులకు బకాయి పడ్డ ఫీజు రీయంబర్స్ మెంట్స్ విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యం, పై చదువులకై సర్టిఫికేట్స్ కోసం కళాశాల దగ్గరికి వెళితే యజమాన్యం ఫీజులు కడితేనే తప్ప సర్టిఫికెట్స్ ఇవ్వలేము అంటున్నాయి. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్న విద్యాయజమాన్యం ఇవ్వాల్సిన 8158 కోట్ల స్కాలర్ షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్స్ ఇప్పటికీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం సిగ్గుచెట్టు. ఒక పక్క కళాశాల యజమాన్యం క్లాసులు నడపాకుండా తరగతుల బహిష్కరిస్తున్న దుస్థితి నెలకొన్నది. దీని ద్వారా విద్యార్థులు తమ క్లాసులు నష్టపోతున్నారు. ఇంత జరుగుతున్న విద్యా వ్యవస్థ పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తల్లి దండ్రులు విద్యార్థుల ఫీజులు కట్టలేక ప్రభుత్వం స్కాలర్ షిప్స్ విడుదల చేయక విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే ఆపివేస్తు, పార్ట్ టైమ్ జాబులు చేసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో విద్యార్థులకు దాదాపు 750 కోట్ల రూపాయలు స్కాలర్షిప్ పెండింగ్ లో ఉన్నాయి. రేవంత్ రెడ్డి విద్యారంగానికి పెద్ద పీట వేస్తాంన్నారు కానీ ఆచరణలో మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది శూన్యం అన్నారు. నేటికి విద్యా రంగానికి విద్యాశాఖ మంత్రి లేకుండా ప్రభుత్వాన్ని నడుపుతున్న తీరు చూస్తే విద్యా వ్యవస్య పట్ల తమ చిత్త శుద్ధి ఎంత ఉన్నదో అర్థం అవుతుంది అన్నారు. మాటలే తప్ప చేతల్లో చేసిందేమీ లేదన్నారు. ప్రభుత్వ ఇప్పటికైనా స్పందించి వెంటనే స్కాలర్ షిప్ లను విడుదల చేయాలి లేని పక్షంలో పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పోరాటాలకు పూనుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యదర్శులు శంకర్, శ్రీకాంత్, చరణ్ అరుణ్ వంశీ, తరంగ్ విప్లవ్, చరణ్ ,ప్రసాద్, కౌశిక్, తనిష్క, తరుణ్ ఉదయ్,శ్రీను, సాయి, హర్ష, సతీష్ వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.



## సిటీలో పెరిగిన నిరుద్యోగ రేటు

### జూన్‌లో 7.1 శాతం.. దేశవ్యాప్తంగా 5.6 శాతం

### పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో వెల్లడి

జూన్‌లో నిరుద్యోగిత (నిరుద్యోగం రేటు) ఫ్లాట్‌గా నమోదైంది. ఈ ఏడాది మే నెలలో మాదిరే జూన్‌లోనూ 5.6 శాతం వద్దే (అన్ని వయసుల వారికి సంబంధించి) కొనసాగింది. ఏప్రిల్‌లో ఉన్న 5.1 శాతం కంటే కొంచెం ఎక్కువ. కానీ, పట్టణాల్లో నిరుద్యోగ రేటు వరుసగా మూడో నెలలోనూ పెరిగింది. జూన్‌లో 7.1 శాతంగా నమోదైంది. ఈ మేరకు పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే వివరాలను కేంద్ర గణాంకాలు, ప్రణాళికల అమలు శాఖ విడుదల చేసింది. పనిచేయగల అర్హతలు ఉండీ, పనిదొరక్క ఖాళీగా ఉన్న వారి గురించి ఈ గణాంకాలు తెలియజేస్తాయి. పట్టణాల్లో అన్ని వయసుల వారికి సంబంధించిన నిరుద్యోగ రేటు 7.1 శాతానికి చేరింది. మేలో 6.9 శాతం, ఏప్రిల్‌లో 6.5 శాతం చొప్పున ఉండడం గమనార్హం. పట్టణాల్లో 15.29 సంవత్సరాల వారిలో నిరుద్యోగ రేటు జూన్‌లో 18.8 శాతానికి పెరిగింది. మే నెలలో ఇది 17.9 శాతంగా ఉంటే, ఏప్రిల్‌లోనూ 17.2 శాతంగా ఉంది. దేశవ్యాప్తంగా మహిళలకు సంబంధించి నిరుద్యోగ రేటు జూన్‌లో 5.6 శాతానికి తగ్గింది. మేలో ఇది 5.8 శాతంగా ఉంది. 15-29 ఏళ్ల వయసు వారిలో నిరుద్యోగిత మే నెలలో 15 శాతంగా ఉంటే, జూన్‌లో 15.3 శాతానికి పెరిగింది. కార్మిక శక్తి భాగస్వామ్య రేటు (15 ఏళ్లకు మించిన వారిలో) మే నెలలో ఉన్న 54.8 శాతం నుంచి జూన్‌లో 54.2 శాతానికి పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లో 56.1 శాతం, పట్టణ ప్రాంతాల్లో 50.4 శాతం చొప్పున జూన్‌లో నమోదైంది. పురుష కార్మికుల భాగస్వామ్య రేటు గ్రామీణ ప్రాంతాల్లో 78.1 శాతం, పట్టణాల్లో 75 శాతం చొప్పున ఉంది. మే నెలతో పోల్చి చూస్తే స్వల్పంగా తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా కార్మికుల భాగస్వామ్య రేటు జూన్‌లో 35.2 శాతానికి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీ, పురుషుల నిరుద్యోగ రేటు పెరగడానికి.. సొంత పనులపై ఆధారపడడం వల్లేనని ఈ సర్వే నివేదిక తెలిపింది.

## రాజీవ్ స్వగృహ ఫ్లాట్లపై ఆసక్తి

**హైదరాబాద్:** మధ్యతరగతి ప్రజలకు సొంతింటి వసతిని కల్పించేందుకు లాభాపేక్ష లేకుండా తక్కువ ధరలకు అందుబాటులో తెచ్చిన ఫ్లాట్ల కొనుగోలుకు హైదరాబాద్ నగరవాసుల ఆసక్తి పెరుగుతోందని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజినీర్ సి.భాస్కర్ రెడ్డి తెలిపారు. నగరంలోని బండ్లగూడ, పోచారం ప్రాంతాల్లోని ఫ్లాట్ల మార్కెట్ ధర కంటే దాదాపు 40 శాతం తక్కువకే అందుబాటులో ఉన్నాయన్నారు. నాగోల్ (Nagole) బండ్లగూడలోని 159 ఫ్లాట్లకు, పోచారంలోని 601 ఫ్లాట్ల విక్రయానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు తెలిపారు. నాగోల్ బండ్లగూడలోని ఫ్లాట్ల కోసం సుమారు 12 వందల మంది ఫోన్లు చేయగా, 700 మంది ప్రాజెక్టును సందర్శించినట్లు తెలిపారు. పోచారం (Pocharam) ఫ్లాట్లకు సంబంధించిన 800 మంది వరకు టెలిఫోన్‌లో సంప్రదించగా, సుమారు 300 మంది వరకు ప్రాజెక్టును సందర్శించారన్నారు. బండ్లగూడ (Bandlaguda) ప్రాజెక్టుకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల



29 వరకు స్వీకరిస్తామని, 30వ తేదీన లాటరీ ద్వారా కేటాయిస్తామని, పోచారం ప్రాజెక్టుకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ వరకు స్వీకరిస్తామని, ఆగస్టు 1వ తేదీన లాటరీ ద్వారా కేటాయిస్తామని ఆయన వివరించారు. అతితక్కువ ధరల్లోనే సొంతింటి కలను నెరవేరేలా ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## క్రెడిట్ కార్డే దిక్కు!

### రూ.50,000లోపు వేతన జీవుల ధోరణి


93 శాతం క్రెడిట్ కార్డులపై ఆధారపడిన వారే



తక్కువ ఆదాయ వర్గాల వారికి క్రెడిట్ కార్డులు ఆధారంగా మారుతున్నాయి. రూ.50,000లోపు ఆదాయం ఉన్న వేతన జీవుల్లో 93 శాతం మంది అవసరాల కోసం క్రెడిట్ కార్డులపై ఆధారపడుతున్నట్టు థింక్ 360.ఏఐ సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. స్వయం ఉపాధిపై ఉన్న వారిలో 85 శాతం మంది క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నారు. ఉద్యోగం, స్వయం ఉపాధిలో ఉన్న 20,000 మంది వ్యక్తుల ఏడాది కాల ఆర్థిక తీరును అధ్యయనం చేసి థింక్ 360 ఈ వివరాలను విడుదల చేసింది. బై నౌ పే లేటర్ (బీఎన్‌పీఎల్/ఇప్పుడు కొని తర్వాత చెల్లించే సదుపాయం) సేవలను సైతం వీరు వినియోగిస్తున్నారు. స్వయం ఉపాధిలోని వారిలో 18%, వేతన జీవుల్లో 15% మంది బీఎన్‌పీఎల్‌ను వినియోగిస్తున్నారు. ఒకప్పుడు ఆకాంక్షలుగానే ఉన్న క్రెడిట్ కార్డులు, బీఎన్‌పీఎల్ సేవలు నేడు నిపుణుల నుంచి తాత్కాలిక ఉద్యోగుల వరకు.. ప్రతి ఒక్కరికీ నిత్యావసరంగా మారాయని థింక్360 వ్యవస్థాపకుడు, సీఈవో అమిత్‌దాస్ తెలిపారు. డిజిటల్ రుణాల్లో ఫిన్‌టెక్‌లు పోషిస్తున్న ముఖ్య పాత్రను కూడా ఈ సంస్థ తన నివేదికలో ప్రస్తావించింది. క్రెడిట్ కార్డు యూజర్ల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఈ ఏడాది మార్చి నాటికి యాక్టివ్ కార్డులు 10 కోట్ల మార్క్‌ను దాటగా.. వచ్చే ఐదేళ్లలో (2029 మార్చి నాటికి) 20 కోట్లకు పెరుగుతాయని ఇటీవల పీడబ్ల్యూసీ అంచనా వేసింది. యూపీఐ దెబ్బకు డెబిట్ కార్డుల వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. చెల్లింపులకు వచ్చే సరికి యూపీఐ తర్వాత క్రెడిట్ కార్డుల హవాయే నడుస్తోంది. బ్యాంకు ఖాతాలో బ్యాలన్స్ ఉంటేనే యూపీఐ. బ్యాలన్స్ లేకపోయినా క్రెడిట్ (అరువు)తో కొనుగోళ్లకు క్రెడిట్ కార్డులు వీలు కల్పిస్తాయి. అందుకే వీటి వినియోగం పట్ల ఆసక్తి పెరుగుతూ పోతోంది. కానీ, క్రెడిట్ కార్డ్‌లను ఇష్టారీతిన వాడేయడం సరికాదు. ఇది క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేస్తుంది. భవిష్యత్‌లో రుణాల అర్హతకు గీటురాయిగా మారుతుంది. రుణ ఊబిలోకి నెట్టేసే ప్రమాదం లేకపోలేదు.

## డాలీ చాయ్‌వాలా ఫ్రాంచైజీలకు 1600 దరఖాస్తులు

పక్కవీధిలోని చిన్న కొట్టులో చాయ్ అమ్ముకునే వ్యక్తి క్రమంగా ఎదుగుతూ, అందరూ ఆదరించేలా చాయ్ తయారు చేస్తూ.. దేశవ్యాప్తంగా ఫ్రాంచైజీలను ఏర్పాటు చేసే స్థాయికి వెళ్తే.. ఆహా అనాల్సిందే కదా. నాగ్‌పూర్‌కు చెందిన డాలీ బతుకుతెరువు కోసం చిన్న కొట్టులో చాయ్ అమ్ముతుండేవాడు. ఒక్కసారి తన చాయ్ తాగినవారు మళ్లీ తాగాలనిపించేలా తయారు చేయడం తన ప్రత్యేకత. దాంతో నగరంలోని చాలా ప్రదేశాల నుంచి తన టీస్టాల్ వద్దకు కస్టమర్లు వచ్చేవారు. క్రమంగా నాగ్‌పూర్‌లో డాలీ చాలా ఫేమస్ అయ్యారు. ఒకనొక సందర్భంలో డాలీ ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్‌గేట్స్‌కు తన చాయ్ రుచి చూపించే అవకాశం కూడా వచ్చింది. దాంతో డాలీ చాయ్‌వాలా మరింత ఫేమస్ అయ్యారు. ఇటీవల డాలీ చాయ్‌వాలా 'డాలీ కీ తప్రి' పేరుతో దేశవ్యాప్తంగా ఫ్రాంచైజీలను ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. దాంతో ఏకంగా రెండు రోజుల్లో 1,600కు పైగా దరఖాస్తులు వచ్చాయి. అందుకోసం ప్రత్యేకంగా ధరలు కూడా నిర్ణయించారు. కార్ట్ స్టాల్ కోసం రూ.4.5 లక్షలురూ.6 లక్షలు, స్టోర్ మోడల్ రూ.20 లక్షలురూ.22లక్షలు, రూ. ఫ్లాగ్‌షిప్ కేఫ్ రూ.39 లక్షలురూ.43 లక్షలు వరకు ఫ్రాంచైజీ ధరలున్నాయి. ఒక వీడియోలో డాలీ తన విజయం గురించి మాట్లాడుతూ..'నాకు పాఠశాలకు వెళ్లే అవకాశం రాలేదు. కానీ నేనెప్పుడూ అవకాశాలను వదులుకోలేదు. చాయ్‌తో ప్రత్యేక ఐడెంటిటీని సంపాదించుకున్నాను. నాతో పాటు ఇతరులు ఎదగాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. ఫ్రాంచైజీ ప్రకటనలో భాగంగా డాలీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఇది భారతదేశపు మొదటి వైరల్ స్ట్రీట్ బ్రాండ్. ప్రస్తుతం ఇది నిజమైన అభిరుచి ఉన్న వ్యక్తులను ఒక వ్యాపార అవకాశం' అని రాసుకొచ్చారు. ఈ ప్రకటనపై సామాజిక మాధ్యమాల్లో మిశ్రమ స్పందన వస్తోంది. 'బర్గర్లు తింటారా అని అడిగే స్థాయి నుంచి వాటిని విక్రయించే స్థాయికి చేరారు' అని ఓ నెటిజన్ కామెంట్ చేశాడు. ఇంకొకరు వార్నింగ్ ఇస్తూ 'ఏ ఫ్రాంచైజీ తీసుకోకండి' అంటూ రిప్లై ఇచ్చాడు.




## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




## మారథాన్ రన్నర్ ఫౌజా సింగ్ మృతి కేసు.. ఎన్ఆర్ఐ అరెస్ట్

**ఛండీగఢ్:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భారత దిగ్గజ మారథాన్ అథ్లెట్ ఫౌజా సింగ్ కేసులో ఎన్ఆర్ఐ అమృత్‌పాల్ సింగ్ ధిల్లాన్(30)ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనలో ప్రమాదం జరిగిన సమయంలో వాహనం నడిపిన అమృత్‌పాల్ సింగ్‌ను కర్తార్‌పుర్‌లో మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఇటీవలే అతడు కెనడా నుంచి భారత్ వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అతడు నడిపిన ఫార్చ్యునర్ ఎస్‌యూవీని కూడా స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. మరికాసేపట్లో అతన్ని కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది. అనంతరం రిమాండ్‌కు తరలించనున్నారు. ఇదిలా ఉండగా.. పంజాబ్‌లోని జలంధర్ సమీపంలోని బియాస్ పిండ్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 114 ఏళ్ల ఫౌజా సింగ్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా, గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో ఫౌజాసింగ్ అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. దగ్గరలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

ప్రపంచంలోనే కురువృద్ధ అథ్లెట్‌గా పేరుగాంచిన ఈ పంజాబ్ పుత్తర్ ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. వందేళ్ల వయసును ఏమాత్రం లెక్కచేయకుండా యువకులకు సవాలు విసురుతూ ప్రపంచ వ్యాప్తంగా వివిధ మారథాన్‌లలో బరిలోకి దిగి సత్తాచాటారు. ఫౌజా సింగ్ మృతి పట్ల పలు ప్రపంచ దేశాలు తమ దిగ్భ్రాంతి ప్రకటించాయి. 1911 ఏప్రిల్ 1న జన్మించిన ఫౌజాసింగ్ 89 ఏళ్ల వయసులో అథ్లెటిక్స్ కెరీర్ మొదలుపెట్టారు. 1993లో ఇంగ్లండ్‌కు వెళ్లిన ఈ దిగ్గజ అథ్లెట్.. 'టర్బన్ టోర్నడో' అంటూ అందరి మన్ననలు పొందారు. 2011లో జరిగిన టొరంటో మారథాన్‌లో 100 ఏళ్ల వయసులో 8 గంటల 11 నిమిషాల్లో రేసు పూర్తి చేసి కొత్త రికార్డు నెలకొల్పాడు. ఐదేళ్ల పసిప్రాయం వరకు నడవని ఆయన.. తన 14 ఏళ్ల అథ్లెటిక్స్ కెరీర్‌లో తొమ్మిది మారథాన్ రేసుల్లో పోటీపడటం విశేషం.

తన కుటుంబసభ్యుల మరణాల నుంచి తేరుకునేందుకు పరుగును ఎంచుకున్న ఫౌజాసింగ్‌ను 2015లో బ్రిటిష్ ఎంపైర్ మెడల్ వరించింది. 2012లో జరిగిన హాంకాంగ్ మారథాన్.. ఆయన చివరి అంతర్జాతీయ రేసుగా నిలిచింది. పంజాబ్‌లో డ్రగ్స్ నియంత్రణకు అక్కడి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ఈ దిగ్గజ అథ్లెట్ కీలకంగా వ్యవహరించారు. కనీసం నడిచే వీలు లేని వయసులో కుర్రాళ్లకు స్ఫూర్తిగా నిలిచిన ఫౌజాసింగ్ అకాల మృతి అందరినీ కలిచివేసింది.


## కోట్లలో మరణాలు.. యాక్టివ్‌లోనే ఆధార్ కార్డులు.. ఏం జరుగుతోంది?

**ఢిల్లీ:** మన దేశంలో ఆధార్ కార్డుల విషయమై భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ సంచలన వ్యాఖ్యలు చేసింది. దేశంలో కోట్ల మంది చనిపోయినప్పటికీ వారి ఆధార్ కార్డులు యాక్టివ్‌గానే ఉన్నాయని ఉడాయ్ తెలిపింది. వాటిలో కేవలం 10 శాతం కార్డులను మాత్రమే డీయాక్టివేట్ చేస్తున్నట్టు వెల్లడించింది. దీని వల్ల ఆధార్ నంబర్లు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కార్డుల విషయమై.. జాతీయ మీడియా 'ఇండియా టుడే' దాఖలు చేసిన సమాచార హక్కు (RTI) దరఖాస్తు నేపథ్యంలో ఉడాయ్ సమాధానం ఇచ్చింది. ఈ క్రమంలో కీలక విషయాలను బయటపెట్టింది. ఈ సందర్భంగా ఉడాయ్.. దేశంలో గత 14 సంవత్సరాల్లో సుమారు 11.7 కోటి మంది మరణించినప్పటికీ కేవలం 1.15 కోట్ల ఆధార్ నంబర్లను మాత్రమే డీయాక్టివేట్ చేసిందని తెలిపింది. ఇది దేశ మరణాల రేటుతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. అయితే, సిటిజన్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) డేటా ప్రకారం.. 2007 నుంచి 2019 వరకు సంవత్సరానికి సగటున 83.5 లక్షల మరణాలు చోటుచేసుకుంటున్నాయి. అయినప్పటికీ 10 శాతం కార్డులను మాత్రమే డీయాక్టివేట్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యులు ఇచ్చే సమాచారం ఆధారంగా జరుగుతుందని ఉడాయ్ వెల్లడించింది. ఇదే సమయంలో గత ఐదు సంవత్సరాల్లో సంవత్సరం వారీగా ఎన్ని ఆధార్ నంబర్లు మరణాల ఆధారంగా డీయాక్టివేట్ చేయబడ్డాయని ఆర్టీఐ ద్వారా అడిగినప్పుడు.. అటువంటి సమాచారం తమ వద్ద లేదు అని యూఐడీఏఐ సమాధానమిచ్చింది. డిసెంబర్ 31, 2024 నాటికి మరణాల ఆధారంగా మొత్తం 1.15 కోట్ల ఆధార్ నంబర్లు డీయాక్టివేట్ చేయబడ్డాయని మాత్రమే యూఐడీఏఐ తెలిపింది. ఈ అసమానత ఆధార్ వ్యవస్థలో మరణాల రిజిస్ట్రేషన్, డీయాక్టివేషన్ ప్రక్రియలో లోపాలను ఎత్తిచూపుతున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే, ఆధార్ నంబర్లు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




### టార్గెట్ స్టోర్‌లో చోరీ..

## పట్టుబడిన భారత మహిళ



**వాషింగ్టన్:** అమెరికాలోని టార్గెట్ స్టోర్‌లో రూ. లక్షకుపైగా విలువైన వస్తువులను దొంగిలిస్తూ భారతీయ మహిళ పట్టుబడింది. బాడీక్యామ్ వీడియోలో ఆమె చోరీకి పాల్పడిన ఘటన రికార్డయ్యింది. యునైటెడ్ స్టేట్స్‌ను సందర్శించేదుకు వచ్చిన ఆమెను ప్రస్తుతం పోలీసులు విచారిస్తున్నారు. ఇల్లినాయిస్ ప్రాంతంలోని ఈ స్టోర్‌లో ఏడు గంటలపాటు గడిపిన ఈమె అనుమానాస్పద ప్రవర్తనను అక్కడి సిబ్బంది గమనించి, పోలీసు అధికారులకు సమాచారమిచ్చారు. ఈ రిటైల్ చైన్ నుండి ఆమె లక్షరూపాయలకు పైగా విలువైన వస్తువులను చోరీ చేసిందని అధికారులు భావిస్తున్నారు. పోలీసులు స్టోర్‌లోని బాడీక్యామ్ ఫుటేజ్‌ను సేకరించారు. సదరు మహిళ ఏడు గంటలుగా స్టోర్‌లో తిరగడాన్ని గమనించామని, ఆమె అక్కడి వస్తువులను తీసుకుంటూ, ఫోన్‌ను చూసుకుంటూ చివరికి డబ్బు చెల్లించకుండా వెళ్లడానికి ప్రయత్నించిందని స్టోర్ సిబ్బంది పోలీసులకు తెలిపారు. వారి ఫిర్యాదు అనంతరం పోలీసులు ఆమెకు సంకెళ్లు వేసి, స్టేషన్‌కు తరలించారు. ఆమెపై నేరారోపణలు మోపినప్పటికీ, ఇంకా అరెస్టు చేయలేదని సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలలో వైరల్ అవుతోంది. ఈ ఘటనపై టార్గెట్ స్టోర్ ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

## పారిపోతూ ఉగ్రవాదులు కాల్పులు

న్యూఢిల్లీ: గత ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిపై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ)ముమ్మరంగా దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో పలు విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఘటనా స్థలంలో ఒక వ్యక్తిని ఉగ్రవాదులు 'కల్మా' పఠించాలని అడిగి, అతను అలా చేయగానే వదిలివేసినట్లు ఎన్ఐఏ విచారణలో తేలింది. దాడి అనంతరం ఉగ్రవాదులు పారిపోతూ, గాలిలో కాల్పులు జరిపారని, భాధితులకు ఎవరూకూడా సాయం అందించకుండా ఉండేందుకే ఇలా చేసివుంటారని ఎన్ఐఏ వర్గాలు భావిస్తున్నాయి. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన పర్వైజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌ల విచారణలో.. ఉగ్రవాదులు అక్కడి నుంచి తప్పించుకుంటున్నప్పుడు గాలిలో కాల్పులు జరిపారని వెల్లడయ్యింది. కాల్పులు జరిగిన ప్రదేశం నుండి ఎన్ఐఏ ఖాళీ బుల్లెట్లను స్వాధీనం చేసుకుంది. ఉగ్రవాదులు ఈ ఘటనకు ముందు అక్కడున్నవారి మతాన్ని తెలుసుకునేందుకు కల్మా చదవమన్నారని ప్రాణాలతో బయటపడిన వారు ఎన్ఐఏ అధికారులకు తెలిపారు. ఎన్ఐఏ ఇప్పటివరకూ లభ్యమైన ఆధారాల మేరకు ముగ్గురు ఉగ్రవాదులలో ఒకరిని పాకిస్తాన్‌కు చెందిన హషీమ్ ముసాగా గుర్తించింది. మిగిలిన ఇద్దరినీ గుర్తించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే వీరు పహల్గామ్ దాడి కోసం భారత్‌లోనికి చొరబడినట్లు అనుమానిస్తున్నారు.

## బస్సులో ప్రసవం.. బయటకు విసిరి పారేసిన తల్లి

నెలలు నిండిన ఓ యువతి బస్సెక్కింది. సరిగ్గా ప్రయాణంలో ఆమెకు నొప్పులు మొదలయ్యాయి. చప్పుడు కాకుండా ప్రసవించిన ఆమె.. ఆ బిడ్డను గుడ్డలో చుట్టి రోడ్డు మీదకు విసిరి పారేసింది. దీంతో ఆ పసిగుడ్డు అక్కడికక్కడే మరణించింది. మహారాష్ట్ర పర్భానీలో దారుణం జరిగింది. బస్సుల్లోనే బిడ్డను ప్రసవించిన ఓ యువతి.. ఆపై దారుణానికి ఒడిగట్టింది. కళ్లు తెరవని ఆ పసికందును రోడ్డు మీదకు విసిరి ప్రాణం తీసింది. ఈ వ్యవహారంలో 19 ఏళ్ల ఆ యువతితో పాటు భర్తగా చెప్పుకున్న మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పర్భానీ నుంచి పుణే వెళ్తున్న స్లీపర్ బస్సులో ఓ జంట ఎక్కింది. మంగళవారం ఉదయం 6.30గం. ప్రాంతంలో బస్సు సేలు రోడ్డుకు చేరుకోగానే.. బస్సులోంచి ఓ చిన్నమూట బయటకు పడింది. కిటికీలోంచి అది చూసిన డ్రైవర్.. అనుమానం వచ్చి బస్సును ఆపి ప్యాసింజర్ల దగ్గరకు వచ్చి ఆరా తీశాడు. అయితే.. తన భార్యకు బస్సు జర్నీ పడలేదని.. వాంతి చేసుకుందని.. దానిని గడ్డలో చుట్టి పడేశామని సదరు వ్యక్తి చెప్పాడు. అయితే బస్సు ఎక్కే సమయంలో ఆమె గర్భంతో ఉన్న విషయం గమనించిన ఓ ప్రయాణికురాలికి ఈ వ్యవహారం అనుమానంగా తోచింది. తోటి ప్రయాణికులను అప్రమత్తం చేసింది. వాళ్లు విసిరేసిన గుడ్డ మూటను విప్పి చూడగా.. అందులో ఓ పసికందు కనిపించింది. దీంతో.. ప్రయాణికులంతా ఆ జంటను నిలదీశారు. తమ పేర్లు రితికా ధిరే, అల్తాఫ్ షేక్‌గా చెప్పుకున్న ఆ జంట.. ఏడాదిన్నరగా పుణేలో కాపురముంటున్నామని చెప్పారు. అయితే బిడ్డను పెంచి పోషించే స్తోమత తమకు లేదని.. అందుకే ఇలా చేశామని ఆ ఇద్దరు చెప్పారు. ఆపై ఎమర్జెన్సీ నెంబర్ 112 ద్వారా పోలీసులను ఈ సమాచారం అందించారు. పార్థీ స్టేషన్ పోలీసులు వచ్చి విచారణ జరపగా.. ఆ జంట భార్యభర్తలే అని నిరూపించేందుకు తగిన ఆధారాలు చూపించలేకపోయింది. దీంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. డెలివరీ అయిన యువతిని ఆస్పత్రికి.. సదరు వ్యక్తిని జైలుకి తరలించారు. డిశ్చార్జి తర్వాత ఆ జంటను కలిపి విచారణ జరిపే యోచనలో పోలీసులు ఉన్నారు.

# మళ్లీ వాయిదా అంటున్నారు.. నిజమేనా?

కొన్నాళ్ల ముందు రిలీజైన 'రాజాసాబ్' టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. డిసెంబరు 5న మూవీ రిలీజ్ అని అధికారికంగా ప్రకటించారు కూడా. దీంతో ఫ్యాన్స్.. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. అలాంటిది ఇప్పుడు సినిమా మరోసారి వాయిదా పడనుందనే రూమర్స్ వస్తున్నాయి. అందుకు గల కారణాలు కూడా కొన్ని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. లెక్క ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ 10న 'రాజాసాబ్'ని థియేటర్లలో రిలీజ్ చేస్తామని ప్రకటించారు. కానీ షూటింగ్ బ్యాలెన్స్, గ్రాఫిక్స్ వర్క్ పూర్తి కాకపోవడంతో వాయిదా వేశారు. ప్రస్తుతం మిగిలిన సీన్స్ అన్ని పూర్తిచేసే పనిలో టీమ్ అంతా ఉంది. త్వరలో సాంగ్స్ చిత్రీకరణ కోసం ఫారిన్ కూడా వెళ్లనున్నారు. అలాంటిది ఇప్పుడు 'రాజాసాబ్' సంక్రాంతికి రావొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 'రాజాసాబ్' ఓటీటీ డీల్ ఇంకా పూర్తి కాలేదు. అందుకే ఈ వాయిదా రూమర్స్ వినిపిస్తున్నాయి. ప్రముఖ ఓటీటీ సంస్థల డిసెంబర్ డీల్స్ అన్నీ పూర్తయ్యాయని, వచ్చే ఏడాది జనవరికి అయితే ఒకటి రెండింటివి ఖాళీగా ఉన్నాయని అంటున్నారు. ఒకవేళ అదే జరిగితే 'రాజాసాబ్' దెబ్బ పడే ప్రమాదముంది. ఎందుకంటే డిసెంబరులో సోలో తేదీని వదులుకుని.. సంక్రాంతికి వస్తే కలెక్షన్స్ తగ్గిపోతాయి. అలా కాదని డిసెంబరులోనే వస్తారా అనేది చూడాలి. మరోవైపు బాలకృష్ణ 'అఖండ 2'.. సెప్టెంబరు 25న రిలీజ్ చేస్తామని ప్రకటించారు. కానీ ఈ తేదీ కూడా మారి డిసెంబరుకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవేళ ఇదే జరిగితే ప్రభాస్ vs బాలయ్య అవుతుందేమో? మరోవైపు డిసెంబర్ 5నే బాలీవుడ్ నుంచి 'ధురంధర్' అనే మూవీ రిలీజ్ కానుంది. దీని వల్ల ప్రభాస్ మూవీకి ఇబ్బంది ఏం ఉండదు. సరే ఇవన్నీ పక్కనబెడితే ప్రస్తుతం వినిపిస్తున్న రూమర్స్ నిజమా కాదా అనేది కొన్నిరోజుల్లో క్లారిటీ వస్తుందేమో?





## రష్మిక గర్ల్‌ఫ్రెండ్ నుంచి తొలి పాట రిలీజ్

సాధారణంగా డ్యాన్స్ అనగానే గంతులు వేయడం లాంటి స్టెప్స్ చాలా వరకు ఉంటాయి. కానీ రష్మిక మాత్రం కాస్త డిఫరెంట్ సాంగ్‌లో కనిపించింది. డ్యాన్స్ కూడా అందుకు తగ్గట్లే ఉంది. ఈమె ప్రధాన పాత్రలో నటించిన 'ద గర్ల్ ఫ్రెండ్' మూవీ త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే తొలి పాటని రిలీజ్ చేసి ప్రమోషన్స్ మొదలుపెట్టారు. 'నదివే' అంటూ సాగిన ఈ పాట.. ప్రేమ సాహిత్యం తరహాలో వెరైటీగా ఉంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మిక లీడ్ రోల్ కాగా, 'దసరా' ఫేమ్ దీక్షిత్ శెట్టి ఈమె సరసన నటిస్తున్నాడు. యానిమల్, పుష్ప 2, ఛావా తదితర సినిమాలతో పాన్ ఇండియా వైడ్ బ్లాక్ బస్టర్స్ అందుకున్న రష్మిక చేసిన లేడీ ఓరియెంటెడ్ మూవీ ఇది. అల్లు అరవింద్ నిర్మించారు. తాజాగా రిలీజ్ చేసిన పాట చూడటానికి వినటానికి బాగానే ఉంది. మూవీని సెప్టెంబరు 5న విడుదల చేయాలనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు తెలుస్తోంది.





## అవకాశాల వేటలో సక్సెస్‌ఫుల్ హీరోయిన్

ఒక్కోసారి సక్సెస్‌ఫుల్ నటి అని ముద్ర వేసుకున్నా అవకాశాలు ముఖం చాటేస్తుంటాయి. నటి ప్రియాంక మోహన్ పరిస్థితి ఇప్పుడు ఇలానే ఉంది. ఈ కన్నడ భామ మాతృభాషతో పాటు తెలుగు, తమిళం భాషల్లోనూ నటిస్తూ దక్షిణాది కథానాయకిగా పేరు తెచ్చుకున్నారు. ఈమె 2019లో కన్నడ చిత్రంతో కథానాయకిగా ఎంట్రీ ఇచ్చారు. ఆ తరువాత తెలుగులో నాని గ్యాంగ్‌లీడర్ చిత్రంలో నటించే అవకాశాన్ని అందుకున్నారు. ఆ చిత్రం ఓకే అనిపించుకుంది. ఆ తర్వాత తమిళంలో శివకార్తికేయన్‌కు జంటగా డాక్టర్, డాన్ చిత్రాల్లో వరుసగా నటించి మంచి విజయాన్ని అందుకున్నారు.

అంతేకాకుండా గ్లామర్‌కు దూరంగా పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సంపాదించుకున్నారు. ఇలా సూర్యతో ఎదర్కుమ్ తుణిందవన్ (ఈటీ), ధనుష్ సరసన కెప్టెన్ మిల్లర్ వంటి చిత్రాల్లో నటించి పాపులర్ అయ్యారు. ఆ మధ్య తెలుగులో నాని సరసన 'సరిపోదా శనివారం' చిత్రంలో నటించి మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. అలాంటిది ఆ తరువాత అవకాశాలు కరువయ్యాయి. నటుడు ధనుష్ దర్శకత్వం వహించి నిర్మించిన 'జాబిలమ్మా నీకు అంత కోపమా' చిత్రంలో ప్రత్యేక పాటలో నటించారు. అంతే ఆ తరువాత తమిళంలో మరో అవకాశం రాలేదు. ెలుగులోనూ ఓజీ అనే ఒకే ఒక్క చిత్రం చేతిలో ఉంది. దీంతో మడి కట్టుకొని కూర్చుంటే ప్రయోజనం ఉండదని గ్రహించారో ఏమోగానీ గ్లామర్‌కు తెర రేపింది. తాజాగా వివిధ భంగిమల్లో ఫొటోలు తీయించుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. అందులో కొన్ని బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు చోటు చేసుకున్నాయి. ఈ ఫొటోలు ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఈ విధంగా ప్రియాంకమోహన్ అవకాశాల వేట మొదలుపెట్టారన్నమాట.



## తొలిసారి పిడకలు చేశా.. వేలి గోర్లలో పేడ.. అలాగే..

సినిమా అంటే ఇష్టం లేదంటుంది. కానీ సినిమా కోసం ఏదైనా చేస్తుంది. సినిమాలు మానేయాలని ఆలోచిస్తుంది. కానీ తను అడుగుపెట్టిన ప్రతి ప్రాజెక్టులో అద్భుతంగా నటిస్తుంది. అలా తరుచిత్రంబళం (తెలుగులో తిరు) సినిమాకుగానూ ఉత్తమ నటిగా జాతీయ అవార్డు అందుకుంది నిత్యామీనన్. ప్రస్తుతం ఈ బ్యూటీ ఇడ్లీ కడై (తెలుగులో ఇడ్లీ కొట్టు) సినిమా చేస్తోంది. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో నిత్య.. పల్లెటూరి యువతిగా కనిపించనుంది.

### పిడకలు చేశా..

ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే తిరు సినిమాకు వచ్చిన జాతీయ అవార్డును అందుకోవడానికి వెళ్లింది. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ.. ఇడ్లీ కడై సినిమా కోసం నేను పిడకలు చేయడం నేర్చుకున్నాను. పిడకలు చేయడానికి సమ్మతమేనా? అని అడగ్గానే ఎందుకు చేయను? అని రంగంలోకి దిగాను. నా జీవితంలో తొలిసారి పేడ చేతిలో పట్టుకుని దాన్ని గుండ్రంగా పిడకలు చేశాను. పిడకలు చేసిన మరునాడే జాతీయ అవార్డు తీసుకునేందుకు వెళ్లాను. అప్పుడు నా వేలి గోర్లలో ఆ పేడ ఇంకా అలాగే ఉంది.

### ఇంత మంచి అనుభూతి..

అది నాకు చాలా సంతోషంగా అనిపించింది. ఈ సినిమా ద్వారా విభిన్నమైన విషయాలు నేర్చుకున్నాను. ఈ మూవీ చేయకపోయుంటే ఇంత మంచి అనుభూతి నాకు దక్కేదే కాదు అని చెప్పుకొచ్చింది. ఇడ్లీ కడై విషయానికి వస్తే తిరుచిత్రంబలం సినిమా తర్వాత ధనుష్ నిత్య కాంబినేషన్‌లో వస్తున్న రెండో మూవీ ఇది! ఇందులో అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, పార్తీబన్, సముద్రఖని కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రం అక్టోబర్ 1న విడుదల కానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com